ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
PRGI REGD NO.: TGTEL/26/A4986
5 DOTS NETWORK
మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 012 | సోమవారం 06-07-2026 | పేజీలు : 8 | వెల : రూ. 4/- www.prabhathakiranam.com
Medchal Malkajgiri | Volume : 1 | Issue : 012 | Monday 06-07-2026 | Pages : 8 | Price : Rs. 4/- Circulated to Telangana Published from Medchal Malkajgiri



## కసి.. కంటెంట్.. కమిట్మెంట్...

# త్రీ ఇన్ వన్ లీడర్..



### రాజన్నకు నీరాజనం పడుతున్న కేడర్

### పార్టీపై నిబద్ధతే లక్ష్యం

మనసున్న వ్యక్తి రాహుల్ గాంధీ

ప్రధానిని చేయడమే లక్ష్యం

మళ్లీ అధికారం కోసం పనిచేస్తా

తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి

- 2లో...

### డటీజ్ రాజగోపాల్ రెడ్డి...!

రాజకీయాల్లో పార్టీ కోసం నిలబడే నాయకులూ ఉంటారు. ప్రజా సేవను జీవిత ధ్యేయంగా మార్చుకునే నాయకులూ ఉంటారు. కానీ పార్టీ నిబద్ధత, నాయకత్వంపై విశ్వాసం, ప్రజల పట్ల సేవాభావం... ఈ మూడింటినీ ఒకే సమయంలో ఆచరణలో చూపించే నాయకులు మాత్రం అరుదుగా కనిపిస్తారు. ఆ కోవలోకి వస్తారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

# స్పీడప్ చేయండి

### మెట్రో ఆలస్యంపై రేవంత్ నజర్

పనుల్లో జాప్యంపై

కేంద్ర మంత్రులకు లేఖలు



హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ స్వాధీనం, రెండో దశ విస్తరణ ప్రక్రియలో జాప్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మెట్రో తొలి దశ విలువ నిర్ధారణ, రుణాల రీఫైనాన్సింగ్, భవిష్యత్ రుణ సమీకరణకు సంబంధించిన ఆర్థిక నిర్మాణ బాధ్యతలను వెంటనే ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్... ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, కిషన్ రెడ్డికి ప్రత్యేక లేఖలు పంపారు.

- 3లో...



## బీజేపీ ముక్త

# రాముడే లక్ష్యం

### కాశీ, మధుర నెక్స్ట్ వెలుగులోకి..

### 'రామ్ రక్ష' ఉద్యమానికి శ్రీకారం

### ఉద్ధవ్ థాకరే సంచలన వ్యాఖ్యలు



అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో శివసేన.. యూబీటీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేముంబైలో "రామ్ రక్ష" ఉద్యమాన్ని ప్రారంభించారు. దాదర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హనుమాన్ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాముడి పేరుతో రాజకీయాలు చేసే వారికి ఆలయ పవిత్రతను కాపాడే హక్కు లేదని విమర్శించారు. రాముడి పేరును వినియోగించి అధికారంలోకి వచ్చినవారే ఇప్పుడు హిందుత్వాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

- 6లో...

# కాళేశ్వరంపై దుష్ప్రచారం

ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఎదురుదాడి

కేటీఆర్‌కు మంత్రి ఉత్తమ్ కౌంటర్




కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విషయంలో బీఆర్ఎస్ ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోప ణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రచార సాధనంగా ఉపయోగించి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఇప్పుడు అదే తప్పులను దాచిపెట్టేందుకు పంపులను వెంటనే ప్రారంభించాలంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కాళేశ్వరం కూల్చింది బీఆర్ఎస్ అయితే దానిని శాస్త్రీయంగా కాపాడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ రాజకీయ విమర్శల కంటే ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

## కాళేశ్వరం అప్పగించండి

వారం రోజుల్లో నీళ్లు ఇస్తాం

కన్నెపల్లి వేదికగా కేటీఆర్ విమర్శలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన అనంతరం మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ తెలంగాణకు ఇచ్చిన వరంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాష్ట్రానికి పట్టిన శనేశ్వరంలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.



# వారసుడెక్కడ

### ఓవైపు తండ్రి అంత్యక్రియలు

మరోవైపు బయటకు రాని మొజ్తబా!

ఖమేనీ అంత్యక్రియల్లో ముగ్గురు కుమారులు

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు టెహ్రాన్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు నివాళులర్పించేందుకు తరలివస్తున్నారు. టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ ముసల్లాలో జరిగిన ప్రార్థనల్లో ఖమేనీ ముగ్గురు కుమారులు మోస్తఫా, మేసామ్, మసూద్ పాల్గొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘలీబఫ్, రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నతాధికారులు కూడా కార్యక్రమంలో హాజరయ్యారు.

- 6లో...

# జీవాయుధాలతో రష్యా దాడులు

ఉక్రెయిన్ సంచలన ఆరోపణలు.. ఆంత్రాక్స్ సమాధుల కలకలం



- 6లో...



- 6లో...

# భారీ వర్షాల హెచ్చరిక

### తెలుగు రాష్ట్రాలకు అలర్ట్.. మత్స్యకారులకు కీలక సూచనలు

### వాయుగుండంగా మారిన అల్పపీడనం

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఇది బాలాసోర్‌కు ఆగ్నేయ దిశగా సుమారు 50 కిలోమీటర్లు, చాంద్‌బలికి ఈశాన్యంగా 60 కిలోమీటర్లు, దిఘాకు దక్షిణ నైరుతి దిశగా 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి–దిఘా మధ్య ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

# మజ్లిస్ కోసం పనిచేస్తోన్న హైడ్రా

### అసద్‌తో రేవంత్ సర్కార్ కుమ్మక్కు

### రేవంత్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు



- 3లో...

హైడ్రా చర్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకునేందుకు ప్రత్యేక వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. మజ్లిస్ అంటే భయమా, ప్రేమా లేక రెండూ కలిసిపోయాయా అని ప్రశ్నించారు. ప్రజలందరికీ ఒకే న్యాయం అమలు చేయాల్సిన ప్రభుత్వం పక్షపాత ధోరణితో ముందుకు సాగుతోందని మండిపడ్డారు.


# వైద్యులూ మనుషులే

### దేవుళ్లకు పడుతున్న భూతాలు

మానసిక సమస్యలతో డాక్టర్లు సతమతం

వైద్యుల్లో పెరుగుతున్న డిప్రెషన్

ప్రాణాలకే ముప్పుగా మారుతున్న ఒత్తిడి



- 6లో...

## బీఆర్ఎస్‌కి దూరం..

# మల్లన్న దుమారం

మల్లారెడ్డి వ్యాఖ్యలతో కొత్త చర్చ.. పార్టీ మార్పుపై జోరుగా ఊహాగానాలు

గ్రేటర్ ఎన్నికల ముంగిట కొత్త పంచాయితీ

- 3లో...



# దటీజ్ రాజగోపాల్ రెడ్డి...!

రాజకీయాల్లో పార్టీ కోసం నిలబడే నాయకులూ ఉంటారు. ప్రజా సేవను జీవిత ధ్యేయంగా మార్చుకునే నాయకులూ ఉంటారు. కానీ పార్టీ నిబద్ధత, నాయకత్వంపై విశ్వాసం, ప్రజల పట్ల సేవాభావం... ఈ మూడింటినీ ఒకే సమయంలో ఆచరణలో చూపించే నాయకులు మాత్రం అరుదుగా కనిపిస్తారు. ఆ కోవలోకి వస్తారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, రాహుల్ గాంధీ లాంటి మానవత్వం ఉన్న నాయకుడు దేశానికి ప్రధానమంత్రి కావాలని కోరుకుంటూ.. ఆ దిశగా పనిచేస్తానని ఆయన ప్రకటించారు. పదవుల కంటే పార్టీ గొప్పదని, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమని తేల్చిచెప్పారు. మరోవైపు మునుగోడులో ఒక్కరికీ కూడా కంటి సమస్య ఉండకూడదనే సంకల్పంతో వేలాది మందికి ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు చేయిస్తూ ప్రజా సేవకు కొత్త అర్థం చెబుతున్నారు. ఇప్పటికే వేల మందికి చూపు వెలుగు అందించిన ఆయన, పదివేల మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పార్టీ కోసం అంకితభావం, రాహుల్ గాంధీపై అపార విశ్వాసం, ప్రజల కోసం నిరంతర సేవ... ఈ మూడు అంశాలు రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. అందుకే ఆయన గురించి మాట్లాడితే ఒక్క మాటలో చెప్పాల్సింది... "దటీజ్ రాజగోపాల్ రెడ్డి!"



# పార్టీపై నిబద్ధతే లక్ష్యం



**మనసున్న వ్యక్తి రాహుల్ గాంధీ**
**ప్రధానిని చేయడమే లక్ష్యం**
**మళ్లీ అధికారం కోసం పనిచేస్తా**
**తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి**

కాంగ్రెస్ పార్టీకి తాను దూరంగా ఉన్నాననే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నానని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని చెప్పారు. తాను వ్యక్తిగత కార్యక్రమాల కంటే పార్టీ బలోపేతానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నానని పేర్కొన్నారు. చౌటుప్పల్, చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ బలపడాలన్నదే తన ఆలోచన అని, ఎలాంటి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోనని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం లక్ష్యంగా పనిచేస్తానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలైతే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆశలు, అవసరాలు తెలుసుకొని పాలన సాగిస్తే కాంగ్రెస్‌కు మరోసారి ప్రజల మద్దతు లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతామని చెప్పారు.

### కార్యకర్తల సంక్షేమమే ప్రాధాన్యం

కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకూడదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. మొదటి నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రజల ప్రయోజనాల కోసం బహిరంగంగా మాట్లాడాల్సి వస్తుందని చెప్పారు. అలాంటి వ్యాఖ్యలను పార్టీ వ్యతిరేకతగా చూడటం సరైంది కాదన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని, ప్రజా సమస్యలపై నిర్మొహమాటంగా స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని వివరించారు.

### రాహుల్‌పై ప్రశంసల వర్షం

రాహుల్ గాంధీపై రాజగోపాల్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. తన రాజకీయ జీవితంలో కలిసిన నాయకుల్లో అత్యంత మంచి మనసున్న వ్యక్తిగా రాహుల్ గాంధీ కనిపించారని అన్నారు. ఆయన మాటలు, ఆలోచనలు, మానవత్వం తనను ఎంతో ప్రభావితం చేశాయని చెప్పారు. ఇంత గొప్ప వ్యక్తి దేశానికి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ఈ దేశానికి ప్రధానమంత్రి కావాలని తాను హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని వెల్లడించారు.

### పదవుల కంటే పార్టీ ముఖ్యం

తనకు పదవులు వచ్చినా రాకపోయినా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయడం తనకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా ఒక్కటిగా కష్టపడితే రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి రావడం సాధ్యమేనని చెప్పారు. అదే సమయంలో దేశ రాజకీయాల్లో కూడా కాంగ్రెస్‌కు బలమైన స్థానం తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీ విజయమే తన లక్ష్యమని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసే దిశగా చివరి వరకు కృషి చేస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.



# ప్రతి కంటికి వెలుగు లక్ష్యం

**మునుగోడులో నేత్ర యజ్ఞం.. 10 వేల మందికి శస్త్రచికిత్సల లక్ష్యం**
**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

మునుగోడు నియోజకవర్గంలో ఒక్క వ్యక్తి కూడా కంటి సమస్యతో బాధపడకూడదనే సంకల్పంతో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబానికి మెరుగైన కంటి ఆరోగ్యం అందించడమే తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు ఎలాంటి భయం లేకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. మీకు నేనున్నాననే భరోసాతో వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

### 15వ విడత శిబిరానికి శ్రీకారం

తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ పేరిట ఏర్పాటు చేసిన సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం శిబిరాన్ని ప్రారంభించారు. ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు.

### వేల మందికి వైద్య సేవలు

ఇప్పటివరకు 14 విడతలుగా నిర్వహించిన శిబిరాల ద్వారా 10,444 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. వారిలో 2,325 మందికి విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని చెప్పారు. మరో 4,557 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, చండూరు, ఘట్టుప్పల్, నారాయణపూర్, చౌటుప్పల్ ప్రాంతాల్లో విడతల వారీగా శిబిరాలు నిర్వహించి వందలాది మందికి చూపు వెలుగు అందించినట్లు తెలిపారు.

### పదివేల శస్త్రచికిత్సల లక్ష్యం

మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి తల్లి, ప్రతి తండ్రికి పెద్దకొడుకుగా నిలిచి కంటి శస్త్రచికిత్సలు చేయిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో ఒక్కరికీ కూడా కంటి సమస్య మిగలకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఆ ప్రణాళికలో భాగంగా మొత్తం పదివేల మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఆరోగ్య సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనేది తన సంకల్పమని వివరించారు.



### 15వ విడతలో భారీ స్పందన

జూలై 5న నిర్వహించిన 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 1,210 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 208 మందికి పైగా శస్త్రచికిత్సలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారిని వైద్యుల వద్దకు తరలించే ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు. చికిత్స పూర్తయ్యే వరకు అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### నిరంతర సేవలకే ప్రాధాన్యం

ఉచిత కంటి వైద్య శిబిరాలు ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతర సేవా కార్యక్రమంగా కొనసాగిస్తామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యమే తనకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కంటి సమస్యలు చిన్నవిగా కనిపించినా నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అందుకే ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మునుగోడు ప్రజలందరికీ సంపూర్ణ కంటి ఆరోగ్యం కల్పించే వరకు ఈ సేవా కార్యక్రమాన్ని విస్తరిస్తూ ముందుకు తీసుకెళ్తామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

# కాళేశ్వరంపై దుష్ప్రచారం

**ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు**
**బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఎదురుదాడి**
**కేటీఆర్‌కు మంత్రి ఉత్తమ్ కౌంటర్**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విషయంలో బీఆర్ఎస్ ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రచార సాధనంగా ఉపయోగించి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఇప్పుడు అదే తప్పులను దాచిపెట్టేందుకు పంపులను వెంటనే ప్రారంభించాలంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కాళేశ్వరం కూల్చింది బీఆర్ఎస్ అయితే దానిని శాస్త్రీయంగా కాపాడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ రాజకీయ విమర్శల కంటే ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

### పంపులు ఆన్ చేయడం అసాధ్యం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించవచ్చన్న బీఆర్ఎస్ వాదనకు మంత్రి గట్టిగా సమాధానం ఇచ్చారు. శాస్త్రీయ పునరావాసం పూర్తయ్యే వరకు మూడు బ్యారేజీలను నిర్వహించరాదని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ స్పష్టంగా ఆదేశించిందని చెప్పారు. ఇంజినీరింగ్ వాస్తవాలు తెలియకుండా పంపులు ఆన్ చేయాలని చెప్పడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పెట్టే నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ తీసుకోదని స్పష్టం చేశారు.

### పునాదుల నుంచే తీవ్రమైన సమస్య

కాళేశ్వరం సమస్య ఒక్క పిల్లర్, ఒక్క గేట్‌కు సంబంధించినది కాదని మంత్రి వివరించారు. మూడు బ్యారేజీల పునాదుల సమగ్రతపైనే



తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని తెలిపారు. సెకండ్ పైల్ కట్-ఆఫ్ వాల్ బలహీనతలు, సీపేజ్, పైపింగ్, స్టిల్లింగ్ బేసిన్ లోపాలు, నాణ్యతా వైఫల్యాలు, శక్తి వ్యయ నిర్మాణాల్లో సమస్యలను జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ గుర్తించిందని వెల్లడించారు. లోపాలను సరిచేయకుండా నీటిని నిల్వ చేస్తే భద్రాచలం సహా దిగువ ప్రాంతాల్లో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.

### ప్రాణహిత మార్పే మూలకారణం

కాంగ్రెస్ రూపొందించిన అసలు ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు అమలై ఉంటే ఉత్తర తెలంగాణకు గ్రావిటీ ద్వారా సుమారు 80 టీఎంసీల స్థిర నీటి భద్రత లభించేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాజకీయ ప్రయోజనాలు, వాణిజ్య లాభాల కోసం ప్రాజెక్టు రూపకల్పన మార్చడం వల్లే నేటి పరిస్థితి ఏర్పడిందన్నారు. స్వార్థం, అత్యాశ, సాంకేతిక రాజీల కారణంగానే కాళేశ్వరం సంక్షోభం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా అసలు ప్రణాళిక అమలై ఉంటే ఉత్తర తెలంగాణకు ఇబ్బందులు వచ్చేవి కావని వివరించారు.

### శాస్త్రీయ పునరుద్ధరణకే ప్రాధాన్యం

ప్రస్తుతం మూడు బ్యారేజీలపై అత్యాధునిక సాంకేతిక పరీక్షలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియను సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎఎఫ్ఆర్వై, ఐఐటీ బొంబాయి, జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. శాస్త్రీయ నివేదికల ఆధారంగానే ప్రతి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

### 2027 లక్ష్యంగా పునర్నిర్మాణం

ప్రస్తుత వర్షాకాలంలో తుది డిజైన్‌లను ఖరారు చేసి వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. జూలై--ఆగస్టు 2027 నాటికి మూడు బ్యారేజీల పునరుద్ధరణ పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అప్పటి వరకు బ్యారేజీలను ఫ్రీ-ఫ్లో స్థితిలోనే కొనసాగిస్తామని వెల్లడించారు. అదే సమయంలో టుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా తెలంగాణకు సుమారు 80 టీఎంసీల నీటిని తీసుకొచ్చే ప్రత్యామ్నాయ ప్రణాళికను కూడా ప్రభుత్వం వేగవంతం చేస్తోందన్నారు. డీపీఆర్ సిద్ధమవుతోందని, మహారాష్ట్రతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజల ప్రాణాలు, ప్రజాధనం, రాష్ట్ర భవిష్యత్ నీటి భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని పునరుద్ఘాటించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం అనుమతులు వచ్చిన తర్వాతే మూడు బ్యారేజీలను పూర్తిస్థాయిలో నిర్వహణలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# కాళేశ్వరం అప్పగించండి

**వారం రోజుల్లో నీళ్లు ఇస్తాం**
**కన్నెపల్లి వేదికగా కేటీఆర్ విమర్శలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన అనంతరం మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ తెలంగాణకు ఇచ్చిన వరంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాష్ట్రానికి పట్టిన శనేశ్వరంలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక్క వారం రోజుల పాటు కేసీఆర్‌కు అప్పగిస్తే తెలంగాణ అంతటా సాగునీరు పారించి చూపిస్తామని సవాలు విసిరారు. ప్రభుత్వం రాజకీయ కక్షతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.

### కన్నెపల్లిలో నీళ్లు ఉన్నా పంపింగ్ లేదన్న ఆరోపణ

కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల వరకు నీరు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం పంపులను ప్రారంభించడం లేదని కేటీఆర్ అన్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లోనే రిజర్వాయర్లను నింపే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాగునీరు అందిస్తే యూరియా ఇవ్వాలి, మద్దతు ధరతో ధాన్యం కొనాలి, విద్యుత్ సరఫరా చేయాలి, బోనస్ చెల్లించాల్సి వస్తుందనే భయంతోనే ప్రభుత్వం నీటిని ఎత్తిపోసే పని చేయడం లేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

### ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి అవసరం

మూడు నెలల క్రితమే ఎల్‌నినో ప్రభావం ఉంటుందని హెచ్చరికలు వచ్చాయని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు.



### రాజకీయ కక్షతో ప్రాజెక్టు నిలిపేశారు

కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం సామర్థ్యాన్ని వినియోగించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కన్నెపల్లి వద్దకు వెళ్లకుండా తమను పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, రైతుల ప్రయోజనాల కోసం వెంటనే పంపులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల నీటి భద్రతకు కాళేశ్వరం అత్యంత కీలకమని, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరించాలని కేటీఆర్ కోరారు.

కాళేశ్వరం ద్వారా ఉమ్మడి ఏడు జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 50 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి పంపులు ఆన్ చేసే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

### ప్రాజెక్టు నిర్మాణంపై వివరణ

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమని కేటీఆర్ అన్నారు. ఇందులో మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, 1,531 కిలోమీటర్ల కాల్వలు ఉన్నాయని వివరించారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు దెబ్బతిన్నాయనే కారణంతో మొత్తం ప్రాజెక్టును నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. మరమ్మతులకు ఎల్‌అండ్‌టీ ముందుకొచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం వేలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తుండగా, మేడిగడ్డ అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటిని తరలించే అవకాశం ఉందని చెప్పారు.

### రైతుల కోసం భారీ పెట్టుబడులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం భారీగా నిధులు వెచ్చించామని కేటీఆర్ తెలిపారు. రైతు సంక్షేమ కార్యక్రమాలకు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశామని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణ వ్యయం రూ.94 వేల కోట్లైతే లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. కాళేశ్వరం వల్లే తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి చేరిందని, రైతుల ఆత్మహత్యలు తగ్గాయని పేర్కొన్నారు.

# కాళేశ్వరం కమీషన్ల దందా

**కేటీఆర్‌కు పొంగులేటి కౌంటర్**
**బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు**

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కన్నెపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ కొత్త నాటకాలకు తెరలేపిందని మండిపడ్డారు.

### కమీషన్ల కోసమే కాళేశ్వరం

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టకుండా భారీ ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు సంపాదించడానికే ప్రాధాన్యం ఇచ్చిందని పొంగులేటి ఆరోపించారు. "పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావు. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు కడితేనే కమీషన్లు వస్తాయనే ఆలోచనతో బీఆర్ఎస్ పాలకులు వ్యవహరించారు. మేము మాత్రం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం" అని స్పష్టం చేశారు. అదే కారణంగా తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేశారని పేర్కొన్నారు.

### నాసిరకం నిర్మాణాలే కారణం

కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడం వల్లే నేడు మరమ్మతుల అవసరం వచ్చిందని మంత్రి అన్నారు. "రిపేర్లు



చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మీ అవినీతి, మీ కక్కుర్తే కారణం కాదా? నాసిరకం నిర్మాణాలు చేసి ఇప్పుడు ప్రభుత్వం వాటిని బాగు చేయలేదని విమర్శించడం విడ్డూరంగా ఉంది" అంటూ బీఆర్ఎస్ నాయకులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజాధనాన్ని వృథా చేసిన వారే ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లిలో పర్యటిస్తూ అబద్ధపు ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని పొంగులేటి అన్నారు. అయితే తెలంగాణ ప్రజలు వారి అసలు స్వరూపాన్ని ఇప్పటికే గుర్తించారని చెప్పారు. ప్రజల రక్తం, చెమటతో కూడిన సంపదను వేల కోట్ల అవినీతితో దోచుకున్న బీఆర్ఎస్‌కు సంక్షేమంపై మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, ఉపాధి కల్పన వంటి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

# రావణ్‌పై యూఏపీఏ కేసు

**ఐదు రోజుల్లో ఐదో అరెస్టు**



యూట్యూబర్ బాచలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు యూఏపీఏ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆదివారం ఆయనను అరెస్టు చేసి విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. గన్నవరం పోలీస్ స్టేషన్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన దళిత సమర శంఖారావం సభలో రావణ్ చేసిన ప్రసంగంలో సీపీఐ-మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహించే వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యూఏపీఏతో పాటు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. భారత ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ప్రయత్నించడం, దేశ భద్రతకు ముప్పు కలిగించే కుట్ర, అల్లర్లకు ప్రేరేపించడం వంటి అభియోగాలు మోపినట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా నిషేధిత సంస్థ భావజాలాన్ని ప్రచారం చేశారనే ఆరోపణలను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

### వరుస అరెస్టులపై వివాదం

గత ఐదు రోజుల్లో ప్రశ్న రావణ్ అరెస్టు కావడం ఇది ఐదోసారి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి నమోదైన నాలుగు కేసుల్లో ఇప్పటికే బెయిల్ పొందారు. అయితే ప్రతి కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో పోలీసులు అరెస్టు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తాజా కేసులో బెయిల్ లభించకుండా ఉండేందుకే యూఏపీఏ వంటి కఠిన చట్టాలను ప్రయోగించారని ఆయన తరపు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ ఆరోపించారు. ఏలూరు సభలో తాను మావోయిస్టుల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ప్రధానంగా రాజకీయ విమర్శలే చేశానని ప్రశ్న రావణ్ తరపు న్యాయవాది తెలిపారు. వరుసగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం చట్ట దుర్వినియోగానికి ఉదాహరణ అని విమర్శించారు.

## రావణ్ అరెస్టుపై భార్య ఆవేదన

**తప్పుడు ప్రచారం నమ్మొద్దని విజ్ఞప్తి.. వీడియో, లేఖతో అనూష వివరణ**



యూట్యూబర్ రావణ్ భార్య అనూష తన భర్త అరెస్టు, ఆయనపై జరుగుతున్న ప్రచారంపై వీడియో, లేఖ ద్వారా స్పందించారు. సమాజంలో మంచి మార్పు రావాలని, రాజ్యాంగం ప్రకారం వ్యవస్థలు పనిచేయాలనే సిద్ధాంతంతోనే రావణ్ ప్రజా సమస్యలపై మాట్లాడుతారని చెప్పారు. ఎవరినీ కించపరచడం, నొప్పించడం ఆయన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని వీడియోలు కల్పితమని, వాటిని సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. రావణ్ కులాన్ని కూడా కొందరు వక్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని అనూష తెలిపారు. తమ కుటుంబానికి కుల, మత విద్వేషాలతో సంబంధం లేదని చెప్పారు. ప్రజలకు వాస్తవం తెలియాలనే ఉద్దేశంతో తన భర్త కమ్మ కులానికి చెందినవారని వెల్లడించారు. ఆయన అధికారిక పేరు కూడా రావణేనని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీతో తమకు సంబంధం లేదని, గొంతులేని వర్గాల తరపున మాట్లాడటమే రావణ్ లక్ష్యమని వివరించారు.







### పీ-4తో ప్రతి ఇంటికి
## బంగారు భవిష్యత్

**బంగారు కుటుంబాల నిర్మాణమే లక్ష్యం: చంద్రబాబు**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా 'మార్గదర్శి--బంగారు కుటుంబం (పీ-4)' కార్యక్రమాన్ని ప్రారంభించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే ఇరవై సంవత్సరాల్లో పేదరికాన్ని తగ్గించి, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. కుప్పంలో నిర్వహించిన పీ-4 మార్గదర్శులు, బంగారు కుటుంబాల సమావేశంలో సీఎం లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. తల్లిని కోల్పోయిన తర్వాత అమ్మమ్మ సంరక్షణలో పెరిగి, ఎన్నో కష్టాలను అధిగమిస్తూ చదువును కొనసాగిస్తున్న ఓ విద్యార్థితో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసి ల్యాబ్ టెక్నీషియన్‌గా మాత్రమే కాకుండా పరిశోధన, అభివృద్ధి రంగంలో ప్రతిభ కనబరిచి శాస్త్రవేత్తగా ఎదగాలని ప్రోత్సహించారు. కష్టాలను అవకాశాలుగా మార్చుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చని సూచించారు. బంగారు కుటుంబానికి చెందిన సరస్వతి అనే మహిళ పీ-4 కార్యక్రమం తమ జీవితంలో మరపురాని మార్పు తీసుకొచ్చిందని తెలిపారు.

# 2029పై చంద్రబాబు ధీమా

**పనితీరే పదవులకు ప్రమాణం**

**టార్గెట్ 2029 లక్ష్యమే టార్గెట్**

**కార్యకర్తలకు చంద్రబాబు సందేశం**

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీకి చెడ్డ పేరు వచ్చేలా ఏ నేత, కార్యకర్త వ్యవహరించకూడదని సూచించారు. సమాజంలో టీడీపీ కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉందని, దానిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రమశిక్షణ, ప్రజలతో సత్సంబంధాలే పార్టీ బలమని స్పష్టం చేశారు.

### పనితీరు ఆధారంగానే పదవులు

పార్టీలో పదవుల కేటాయింపులో ఎలాంటి మొహమాటాలకు తావు ఉండదని చంద్రబాబు తేల్చిచెప్పారు. కేవలం పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం నిజాయితీగా శ్రమించిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమన్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా కష్టపడే కార్యకర్తలను గౌరవించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

### 2029 విజయమే లక్ష్యం

2029 ఎన్నికల్లో టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల కంటే భారీ మెజార్టీ సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంటికో పారిశ్రామికవేత్త" విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిపాలన బలోపేతం కావాలని సీఎం పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, పోలీసులతో పార్టీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలును కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం కనిపిస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. "ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు, పార్టీ ద్వారా రాజకీయ కార్యక్రమాలు కొనసాగాలి" అని స్పష్టం చేశారు.

### అమరావతిపై మరోసారి స్పష్టత

అమరావతే ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని అని చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఎలాంటి కుట్రలు జరిగినా రాజధానిని మార్చడం సాధ్యం కాదన్నారు. గత 2019--24 కాలాన్ని రాష్ట్రానికి పీడకలగా అభివర్ణిస్తూ, కుప్పంలో ప్రశాంతతను దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. రౌడీయిజానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అండగా నిలవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**జనసేనలో పోలవరం కలకలం**

**ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సవాళ్లు**

**ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్రం**



# బాలరాజుపై చిర్రెత్తుకొస్తోంది

పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త వివాదానికి దారితీశాయి. తనను నియోజకవర్గంలోని కొందరు పెత్తందారులు అణచివేస్తున్నారని, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా స్వేచ్ఛగా పనిచేయనివ్వడం లేదని బాలరాజు ఇటీవల ఆరోపించారు. తన ఎదుగుదలను చూసి కొందరు కుట్రలు చేస్తున్నారని, చాలా కాలంగా మౌనంగా భరించినా ఇక సహించబోనని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### బుచ్చిరాజు ప్రశ్నల వర్షం

ఎమ్మెల్యే వ్యాఖ్యలకు బుట్టాయిగూడెం మండల జనసేన అధ్యక్షుడు బుచ్చిరాజు ఘాటుగా స్పందించారు. పెత్తందారులు అణిచివేస్తే కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. విలాసవంతమైన ఇల్లు, విద్యాసంస్థలు, రెస్టారెంట్లు, భూములు ఎలా వచ్చాయని నిలదీశారు. పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం రూ.50 లక్షలు అడిగారన్న ఆరోపణ కూడా చేశారు. పార్టీ కోసం పనిచేసిన జనసైనికులు, వీర మహిళలకు న్యాయం చేశారా అని ప్రశ్నిస్తూ, నామినేటెడ్ పదవుల కేటాయింపులో పారదర్శకత లేదని విమర్శించారు. తన వద్ద ఉన్న ఆధారాలతో అవినీతి ఆరోపణలను నిరూపిస్తామని సవాల్ విసిరారు. అంతకు ముందు... ఏలూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నిర్మాణ సారథుల ఎంపిక కోసం దరఖాస్తులు సమర్పించేందుకు ఎమ్మెల్యే బాలరాజు తన అనుచరులతో ర్యాలీగా రావడాన్ని నగర కార్యదర్శి మధు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద బల ప్రదర్శన అవసరమా అంటూ ఎమ్మెల్యే వైపు దూసుకెళ్లారు.



**మల్లారెడ్డి వ్యాఖ్యలతో కొత్త చర్చ**

**పార్టీ మార్పుపై జోరుగా ఊహాగానాలు**

**గ్రేటర్ ఎన్నికల ముంగిట కొత్త పంచాయితీ**

**బీఆర్ఎస్‌కి దూరం..**

# మల్లన్న దుమారం

మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఓ కార్యకర్త పుట్టినరోజు వేడుకలో మాట్లాడిన ఆయన, "నేను బీఆర్ఎస్‌కు దూరమ వుతున్నానని నన్ను మర్చిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఈ మాటలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో విస్తృత చర్చ ప్రారంభమైంది. ఆయన వ్యాఖ్యలను పార్టీ మార్పుకు సంకేతంగా కొందరు విశ్లేషిస్తున్నారు.

### ఊహాగానాలకు బలం

మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యల తర్వాత ఆయన త్వరలోనే పార్టీ మారే అవకాశముందనే ప్రచారం మరింత జోరందుకుంది. ముఖ్యంగా మేడ్చల్ నియోజకవర్గంలో ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఇప్పటి వరకు మల్లారెడ్డి పార్టీ మార్పుపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన వ్యాఖ్యల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారిక స్పష్టత కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం మల్లారెడ్డి వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారంలో వాస్తవం ఎంత ఉందన్నది ఆయన స్పందన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అప్పటి వరకు ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగానే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

# స్పీడప్ చేయండి

**మెట్రో ఆలస్యంపై రేవంత్ నజర్**

**పనుల్లో జాప్యంపై కేంద్ర మంత్రులకు లేఖలు**



హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ స్వాధీనం, రెండో దశ విస్తరణ ప్రక్రియలో జాప్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మెట్రో తొలి దశ విలువ నిర్ధారణ, రుణాల రీఫైనాన్సింగ్, భవిష్యత్ రుణ సమీకరణకు సంబంధించిన ఆర్థిక నిర్మాణ బాధ్యతలను వెంటనే ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్... ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, కిషన్ రెడ్డికి ప్రత్యేక లేఖలు పంపారు.

### సమగ్ర పరిశీలన అవసరమన్న సీఎం

మెట్రో తొలి దశ విలువ నిర్ధారణ, ప్రస్తుత రుణాల పునర్వ్యవస్థీకరణ, రెండో దశకు అవసరమైన ఆర్థిక ప్రణాళిక పరస్పరం అనుసంధానమై ఉన్న అంశాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ మూడు అంశాలను ఒకేసారి పరిశీలిస్తేనే సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అందుకే ఎలాంటి ఆలస్యం లేకుండా ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించాలని కేంద్రాన్ని కోరారు.

### ముందుకు కదలని ఒప్పందం

జూన్ 24న కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమక్షంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన సమావేశంలో మెట్రో తొలి దశ విలువ నిర్ధారణ బాధ్యతలను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని నిర్ణయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. అయితే ఆ నిర్ణయం తీసుకుని రోజులు గడిచినా ఇప్పటికీ సంస్థకు అధికారిక బాధ్యతలు అప్పగించలేదని తెలిపారు. విధి విధానాలను కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

### జాప్యంతో పెరుగుతున్న ఇబ్బందులు

మెట్రో తొలి దశ స్వాధీనం ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల ప్రాజెక్టు నిర్వహణలో అనిశ్చితి నెలకొంటోందని సీఎం తెలిపారు. అదే సమయంలో రెండో దశ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియ కూడా ఆలస్యమవుతోందని వివరించారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రాజెక్టు అమలు మరింత వెనుకబడటంతో పాటు వ్యయభారం కూడా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### త్వరిత నిర్ణయాలకే విజ్ఞప్తి

మెట్రో తొలి దశ స్వాధీనం ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, రెండో దశ విస్తరణ పనులను వేగవంతం చేయాలంటే ఎస్‌బీఐ క్యాప్స్‌కు వెంటనే బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వానికి విధి విధానాలను వెంటనే తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మెట్రో విస్తరణ పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# మజ్లిస్ కోసం పనిచేస్తోన్న హైడ్రా



**అసద్‌తో రేవంత్ సర్కార్ కుమ్మక్కు**

**రేవంత్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు**

హైడ్రా చర్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకునేందుకు ప్రత్యేక వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. మజ్లిస్ అంటే భయమా, ప్రేమా లేక రెండూ కలిసిపోయాయా అని ప్రశ్నించారు. ప్రజలందరికీ ఒకే న్యాయం అమలు చేయాల్సిన ప్రభుత్వం పక్షపాత ధోరణితో ముందుకు సాగుతోందని మండిపడ్డారు.

### హైడ్రా చర్యలపై ప్రశ్నలు

హైడ్రా పేరిట సామాన్య ప్రజల ఇళ్లపై వేగంగా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, సల్కం చెరువు పూర్తి నీటి మట్టం, బఫర్ జోన్‌లో ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిష్టర్ ఫాతిమా ఓవైసీ విద్యాసంస్థల విషయంలో మాత్రం మౌనంగా ఉందని కిషన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకున్నా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా ఇప్పటి వరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని పేర్కొన్నారు.

### మజ్లిస్‌కు ప్రత్యేక ప్రాధాన్యమా?

కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీనే మొత్తం ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లు వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఇది పూర్తిగా తప్పు అని స్పష్టం చేశారు. హైడ్రా చర్యల్లో పేద ముస్లింల ఇళ్లు కూల్చివేసినప్పుడు మజ్లిస్ స్పందించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ కూడా వారి తరఫున మాట్లాడలేదని అన్నారు. అయితే ఒవైసీ కుటుంబానికి చెందిన ఆస్తుల విషయంలో మాత్రం కాంగ్రెస్, మజ్లిస్ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

### ఓటు బ్యాంకు రాజకీయాలు



ముస్లిం సమాజంపై ప్రేమతో కాకుండా ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలను బయట పెట్టిందని వ్యాఖ్యానించారు. తాము ముస్లిం సమాజానికి ప్రతినిధులమని చెప్పుకునే కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల నిజస్వరూపం ఈ ఘటనతో బయటపడిందని అన్నారు.

### ఒకే చట్టం అమలు చేయాలని డిమాండ్

ప్రజల భూములు, చెరువులు, ప్రభుత్వ ఆస్తులు తెలంగాణ ప్రజల సొత్తేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ అండ ఉన్నవారి వ్యక్తిగత ఆస్తులుగా ఎవరూ భావించకూడదని అన్నారు. మతం, ఓటు బ్యాంకు ఆధారంగా పాలన సాగించడం మానేసి ప్రజలందరికీ ఒకే చట్టం, ఒకే న్యాయం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం చేసే ప్రభుత్వ వైఖరితో ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని, ఈ తీరుకు ప్రజలే సరైన సమయంలో గట్టి సమాధానం చెబుతారని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# ఆమెకు 26.. అతడికి 28

**భారత్‌లోయువతీయువకుల సగటు వివాహ వయసు ఇదే**

'ఏ ఈడులో జరగాల్సిన ముచ్చట ఆ ఈడులో జరగాల్సిందే' ..అంటూ ఒకప్పుడు ఆడైనా, మగైనా యుక్తవయసు రాగానే పెళ్లి చేసేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. నేటి ఆధునిక ప్రపంచంలో.. జీవితంలో అన్ని విధాలా స్థిరపడ్డాకే పెళ్లి అనే భావన బాగా పెరిగింది. బాగా చదివి.. ఉద్యోగమో, వ్యాపారమో చేసి ఆర్థిక స్థిరత్వం సాధించాకే పెళ్లిపీటలు ఎక్కాలని నేటి యువత భావిస్తోంది. పెళ్లి సంబంధాలు చూసే విధానంలో కూడా పెనుమార్పులు వచ్చాయి. ఒకప్పుడు తెలిసిన సంబంధాలు చూసేవారు.. ఇప్పుడు డిజిటల్ బాట పడుతున్నారు. ప్రముఖ వెడ్డింగ్ ప్రొఫైల్ మేకర్ సంస్థ 'బయోడేటా బిల్డర్' భారతదేశంలో పెళ్లిళ్ల ట్రెండ్స్‌పై విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడైన వివరాలివి. పాశ్చాత్య సంస్కృతి, డేటింగ్ యాప్‌ల హడావుడి నగరాల్లో ఎంత కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేలా ఉన్నాయని.. దేశంలో జరుగుతున్న మొత్తం వివాహాల్లో దాదాపు 85 శాతం పెళ్లిళ్లు ఇప్పటికీ పెద్దలు కుదిర్చినవి లేదా యువతీ యువకులు ఇష్టపడితే పెద్దల సమక్షంలో జరుగుతున్నవేనని నివేదిక పేర్కొంది. దాని ప్రకారం.. దశాబ్దన్నర క్రితంతో పోలిస్తే భారతీయుల సగటు వివాహ వయసు దాదాపు రెండేళ్లు పెరిగినట్లు ఈ సర్వే నివేదిక వెల్లడించింది. 2010 నాటికి అమ్మాయిల సగటు వివాహవయసు 24గా ఉండగా.. ఇప్పుడది 26 ఏళ్లకు చేరింది. అబ్బాయిల సగటు వివాహవయసు కూడా 26 నుంచి 28కి పెరిగింది. మెజారిటీ సందర్భాల్లో పెళ్లి సంబంధం కుదరాలంటే జాతక పొంతన తప్పనిసరిగా మారింది. సర్వే ప్రకారం 65 శాతానికి పైగా కుటుంబాలు.. అబ్బాయి/అమ్మాయి బయోడేటాతో పాటే వారు పుట్టిన సమయం, పుట్టిన ప్రాంతం, గోత్రం, రాశి, నక్షత్రం వివరాలను కోరుతున్నాయి. జాతకాలు కుదిరితేనే తదుపరి పెళ్లి చూపుల ముచ్చట మొదలవుతోంది.

**అయినా.. మనోళ్లే టాప్**

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మగవారు సగటున ఏ వయసు పెళ్లి చేసుకుంటున్నారన్న అంశంపై ప్రముఖ అంతర్జాతీయ పురుషుల ఆరోగ్య సంరక్షణ సంస్థ మాన్యువల్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 'మేల్ మైల్‌స్టోన్స్- మెన్ ఇన్ నంబర్స్' సర్వేలో పురుషుల వివాహ వయసుకు సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వే ప్రకారం ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతీయ పురుషులు అత్యంత తక్కువ వయసులోనే వివాహ బంధంలోకి అడుగుపెడుతుండగా, పాశ్చాత్య దేశాల్లో మాత్రం 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో పెళ్లి చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. మాన్యువల్ సర్వే చేసిన 35 దేశాల జాబితాలో.. అత్యంత పిన్న వయసులోనే పెళ్లి చేసుకుంటున్న పురుషు లు ఉన్న దేశంగా భారతదేశం మొదటి స్థానంలో నిలిచింది. భారత్‌లో పురుషుల సగటు వివాహ వయసు 26 ఏళ్లుగా నమోదైంది. భారత్ తర్వాత చైనా 27.1 ఏళ్లు, రష్యా 27.4 ఏళ్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక.. ఆస్ట్రేలియా పురుషులు సగటున 39.3 ఏళ్ల వయసులో వివాహం చేసుకుంటున్నారు. ఆస్ట్రియా (37.4 ఏళ్లు), స్వీడన్ (36.7 ఏళ్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బ్రిటన్‌లో పురుషుల సగటు వివాహ వయసు 33.4 ఏళ్లు కాగా.. అమెరికాలో 29.8 ఏళ్లుగా నమోదైంది.




## తెరల వెనుక తీరని విషాదం

నేటి ఆధునిక సమాజం ఒక కంటికి కనిపించని డిజిటల్ మాఫియా ఉచ్చులో చిక్కుకుంది. ఉదయం కళ్లు తెరవగానే చేతిలోకి వచ్చే స్మార్ట్‌ఫోన్, మనల్ని తెలియకుండానే ఒక మాయా ప్రపంచంలోకి లాగేస్తోంది. సోషల్ మీడియా నోటిఫికేషన్లు, ఇన్స్టాగ్రామ్ రీల్స్, నెగెటివ్ వార్తల హోరు మనశ్శాంతిని దూరం చేస్తున్నాయి. ఈ డిజిటల్ వ్యసనం కేవలం సమయాన్ని మాత్రమే కాదు, మనుషుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా గుల్ల చేస్తోంది. గంటల తరబడి స్క్రీన్లకు బందీలు కావడం వల్ల నిద్రలేమి, ఊబకాయం, తీవ్రమైన ఆందోళన వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మరోవైపు, ఒకే ఇంట్లో ఉన్నా మాట్లాడుకోలేని స్థితిలో కుటుంబ బంధాలు ముక్కలవుతున్నాయి. మైదానాల్లో ఆడాల్సిన పిల్లలు ఫోన్ల మాయలో పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ప్రమాదకరమైన డిజిటల్ ధోరణుల నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి, స్వీయ నియంత్రణతో కూడిన డిజిటల్ మినిమలిజం వైపు తక్షణమే అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- 7లో...

# ప్రవాసాంధ్రులే ఏపీ శక్తి

**కొరియా నుంచి ఏపీకి పెట్టుబడుల కొత్త అధ్యాయమన్న నారా లోకేశ్**




దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రవాసాంధ్రులకు కీలక సందేశం ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. విదేశాల్లో సాధించే ప్రతి విజయం రాష్ట్ర గౌరవాన్ని పెంచుతుందని చెప్పారు. ఏపీ అభివృద్ధి అవకాశాలను ప్రపంచానికి తెలియ జేయాలని, పెట్టుబడిదారులను రాష్ట్రానికి తీసుకురావడంలో ప్రవాసులు ముందుం డాలని కోరారు. పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులు, పెట్టుబడి దారులకు అనుకూల వాతావరణం కారణంగా ఆంధ్రప్రదేశ్ విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదుగుతోందని వివరించారు.

- 5లో...



# రెండ్రోజులు ఆగండి.. ఇరాన్ సంగతి తేల్చేస్తా..

## ట్రంప్ లేటెస్ట్ వార్నింగ్

**బెదిరింపులకు భయపడం అంత సీన్ లేదంటూ కౌంటర్లు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలను పెంచా యి. ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన దేశ అత్యున్నత నాయకత్వాన్ని అమెరికా కోరుకుంటే "ఒక్క దాడితో అంతమొందించగలదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చలు కొనసాగించే అవకాశం ఉండాలనే ఉద్దేశంతో అలాంటి చర్య తీసుకోవడం లేదని కూడా చెప్పారు.

# పీకేకి తొలి పరీక్ష

**ఎన్నికల బరిలో ప్రశాంత్ కిశోర్**

**బాంకీపూర్‌లో రాజకీయ పరీక్ష**

**ఉపఎన్నికపై దేశవ్యాప్త ఆసక్తి**



- 5లో...



# 2029పై చంద్రబాబు ధీమా

**పనితీరే పదవులకు ప్రమాణం.. టార్గెట్ 2029 లక్ష్యమే టార్గెట్**

**కార్యకర్తలకు చంద్రబాబు సందేశం**

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీకి చెడ్డ పేరు వచ్చేలా ఏ నేత, కార్యకర్త వ్యవహరించకూడదని సూచించారు. సమాజంలో టీడీపీ కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉందని, దానిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రమశిక్షణ, ప్రజలతో సత్సంబంధాలే పార్టీ బలమని స్పష్టం చేశారు.

- 3లో...

# హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్

**పోలీసు వ్యవస్థపై తీవ్ర విమర్శలు**

**రాష్ట్రంలో పోలీసు పాలనంటూ ధ్వజం**

**ప్రమాదంలో ప్రజాస్వామ్య మన్న వైఎస్ జగన్**



వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో పోలీసు వ్యవస్థ అత్యంత ప్రమాదకర దిశగా సాగుతోందని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వరాలను అడ్డుకోవడం కోసం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటు న్నాయని, చట్టం అందరికీ సమానంగా అమలవ్వాల్సిన పరిస్థితి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

- 5లో...



# ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

**సముద్రంలో కొనసాగుతోన్న గాలింపు**

**ఒకరు సేఫ్, మిగతా వారి కోసం వేట**

**గాలింపు ముమ్మరం చేయాలి: పవన్**

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి జూలై 1న వేటకు వెళ్లిన మెకనైజ్డ్ బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురు గల్లంతవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బోటు యజమాని కర్రి చిన్నను ఆదివారం ఉదయం ఓ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించింది. మిగిలిన ఆరుగురి కోసం భారత నౌకాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా సముద్రంలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గల్లంతైన వారిలో ఐదుగురు విజయనగరం జిల్లా ముక్కాం గ్రామానికి చెందినవారు. ఒకరు భీమునిపట్నం ప్రాంతానికి చెందినట్లు అధికారులు తెలిపారు.

- 5లో...

# బాలరాజుపై చిర్రెత్తుకొస్తోంది



**జనసేనలో పోలవరం కలకలం**

**ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సవాళ్లు**

**ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్రం**

పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త వివాదానికి దారితీశాయి. తనను నియోజకవర్గంలోని కొందరు పెత్తందారులు అణచివేస్తున్నారని, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా స్వేచ్ఛగా పనిచేయనివ్వడం లేదని బాలరాజు ఇటీవల ఆరోపించారు. తన ఎదుగుదలను చూసి కొందరు కుట్రలు చేస్తున్నారని, చాలా కాలంగా మౌనంగా భరించినా ఇక సహించబోనని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# శ్రీవారి చెంతకు కాలినడకన 116 ఏళ్ల మహిళ

**భక్తురాలి భక్తికి తిరుమల వందనం...**

**నవనీతమ్మకు ప్రత్యేక వీఐపీ దర్శనం**

- 5లో...

# రావణ్‌పై యూఏపీఏ కేసు

**ఐదు రోజుల్లో ఐదో అరెస్టు**



యూట్యూబర్ బాచలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు యూఏపీఏ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆదివారం ఆయనను అరెస్టు చేసి విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. గన్నవరం పోలీస్ స్టేషన్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు.

- 3లో...

# రావణ్ అరెస్టుపై భార్య ఆవేదన

**తప్పుడు ప్రచారం నమ్మొద్దని విజ్ఞప్తి**

**వీడియో, లేఖతో అనూష వివరణ**

- 3లో...

- 5లో...

# నాయకత్వంపై ప్రశ్నలు

**పిఠాపురంలో జనసేనలో అసంతృప్తి..?**

**అధిష్టానం జోక్యం కోరుతున్న నేతలు**

# రాయలసీమకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ వరం

- 5లో...



# నాయకత్వంపై ప్రశ్నలు

**పిఠాపురంలో జనసేనలో అసంతృప్తి..?**

**అధిష్ఠానం జోక్యం కోరుతున్న నేతలు**

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ అంతర్గత వ్యవహారాలపై కొందరు నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర బాధ్యతలతో బిజీగా ఉండటంతో నియోజకవర్గానికి ప్రత్యేక ఇన్‌చార్జి లేకపోవడం వల్ల కార్యకర్తలకు సరైన మార్గదర్శకం అందడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఫైవ్-మెన్ కమిటీ పనితీరుపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రూపు రాజకీయాలు పెరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కష్టపడినా లభించని గుర్తింపు**

పార్టీ కోసం ప్రారంభం నుంచి పనిచేసిన సీనియర్ నాయకులు, దివ్యాంగ సంఘాల ప్రతినిధులకు తగిన గుర్తింపు లభించడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం--2016 ప్రకారం పార్టీ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని వారు కోరుతున్నారు. స్థానిక నాయకుల కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితులపై పార్టీ అధిష్ఠానం సమీక్ష నిర్వహించి, సమర్థమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని పలువురు సీనియర్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాయలసీమకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ వరం



రాయలసీమలో రూ.16,350 కోట్ల పెట్టుబడితో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ ప్రాజెక్టుతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని మంత్రి వెల్లడించారు.

## శ్రీవరం హోమ్ ఫుడ్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రొద్దుటూరులోని సాయికుటీర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవరం హోమ్ ఫుడ్స్ దుకాణాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్వీట్లు, తినుబండారాలు, పచ్చళ్లు, పొడుల తయారీ విధానాన్ని పరిశీలించారు. నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించాలని నిర్వాహకులకు సూచించారు. మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి స్థానిక యువ పారిశ్రామికవేత్తలను అభినందించారు. దుకాణ యజమాని రవి మాట్లాడుతూ స్వచ్ఛమైన నెయ్యితో ఆర్గానిక్ పద్ధతిలో ఉత్పత్తులు తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరుతో పాటు ఇతర ప్రాంతాలు, విదేశాలకు కూడా కొరియర్ ద్వారా ఉత్పత్తులు పంపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలు కాదు.. స్టీల్ ప్లాంట్ పూర్తి చేయాలి



ప్రొద్దుటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌పై ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా నిర్మాణం ముందుకు సాగలేదని గుర్తు చేశారు. ఈసారి కూడా ప్రజలు మోసపోకూడదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణీత గడువులోగా ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవం నిర్వహించాలని కోరారు. శంకుస్థాపనలతో ప్రజల్లో విశ్వాసం కలగదని, పనులు పూర్తి చేసి పరిశ్రమను ప్రారంభించినప్పుడే నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. 2028 జూలై 3 నాటికి స్టీల్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## తొగట వీర క్షత్రియ సంఘం

**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం.. ఐక్యతే సంఘ బలమన్న నేతలు**



ప్రొద్దుటూరులోని వసంతపేట శ్రీ చౌడేశ్వరి దేవి తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో తొగట వీర క్షత్రియ సంఘం కడప జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా బండారు సూర్యనారాయణ సహా పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ కులంలో పేద, ధనిక అనే భేదాలు లేకుండా అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. అవసరమైన సమయంలో పరస్పరం సహకరించుకోవాలని, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. జిల్లా తొగట వీర క్షత్రియుల ఐకమత్యం ఆదర్శనీయమని ప్రశంసించారు. జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల, నియోజకవర్గ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి సంఘాన్ని గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని చెప్పారు. నిబద్ధతతో పనిచేసే బృందంగా సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రవాసాంధ్రులే ఏపీ శక్తి

**కొరియా నుంచి ఏపీకి పెట్టుబడుల**

**కొత్త అధ్యాయమన్న నారా లోకేశ్**



దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రవాసాంధ్రులకు కీలక సందేశం ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. విదేశాల్లో సాధించే ప్రతి విజయం రాష్ట్ర గౌరవాన్ని పెంచుతుందని చెప్పారు. ఏపీ అభివృద్ధి అవకాశాలను ప్రపంచానికి తెలియజేయాలని, పెట్టుబడిదారులను రాష్ట్రానికి తీసుకురావడంలో ప్రవాసులు ముందుండాలని కోరారు. పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కారణంగా ఆంధ్రప్రదేశ్ విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదుగుతోందని వివరించారు.

**కొరియాతో బలమైన భాగస్వామ్యం**

భారత్‌లో దక్షిణ కొరియాకు అత్యంత నమ్మకమైన భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్ నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని లోకేశ్ తెలిపారు. కియా సంస్థ విజయగాథను ఉదాహరణగా చూపుతూ, అదే తరహాలో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రావాలని ఆకాంక్షించారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు విశాల అవకాశాలు ఉన్నాయని చెప్పారు. దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం ఆంధ్రప్రదేశ్‌కు ప్రేరణగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

**పెట్టుబడుల కోసం ప్రత్యేక కార్యాచరణ**

దక్షిణ కొరియాలో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో జరిగిన సమావేశంలో మంత్రి లోకేశ్ పెట్టుబడులపై విస్తృతంగా చర్చించారు. శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కే వంటి ప్రముఖ ఎలక్ట్రానిక్స్, చిప్ తయారీ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో సిద్ధంగా ఉన్న పారిశ్రామిక క్లస్టర్లను పెట్టుబడిదారులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కొరియా చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం శ్రీసిటీలో ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్ ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల్లో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని లోకేశ్ తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలతో ప్రపంచ ఉద్యోగ విపణిలో పోటీ పడేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని వివరించారు.

**ఏపీ-కొరియా సంబంధాలకు కొత్త దిశ**

కియా-హ్యుందాయ్ ఆటో ఈవీ క్లస్టర్ విస్తరణ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, బ్యాటరీ తయారీ యూనిట్లు, గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటుపై చర్చలు జరిగాయి. ఏపీ-కొరియా ప్రత్యేక డెస్క్ ఏర్పాటు ద్వారా పరిశ్రమల అనుసంధానానికి వేగం తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో ద్వారా ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందాలు, కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం చేయాలని కోరారు. ప్రవాసాంధ్రుల సహకారం, కొరియా సంస్థల పెట్టుబడులు, ప్రభుత్వ అనుకూల విధానాలు కలిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా ఎదగగలదనే విశ్వాసాన్ని మంత్రి లోకేశ్ వ్యక్తం చేశారు.

# హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్



**పోలీసు వ్యవస్థపై తీవ్ర విమర్శలు**

**రాష్ట్రంలో పోలీసు పాలనంటూ ధ్వజం**

**ప్రమాదంలో ప్రజాస్వామ్య మన్న వైఎస్ జగన్**

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో పోలీసు వ్యవస్థ అత్యంత ప్రమాదకర దిశగా సాగుతోందని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వరాలను అడ్డుకోవడం కోసం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, చట్టం అందరికీ సమానంగా అమలవ్వాల్సిన పరిస్థితి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చిన్నారుల అదృశ్యం, మహిళలపై దాడులు, గిరిజన మహిళపై జరిగిన దారుణ ఘటన వంటి కేసుల్లో దర్యాప్తు వేగంగా సాగడం లేదని జగన్ ఆరోపించారు. కాకినాడ జిల్లా తునికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై నెల రోజులు గడిచినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. పెద్దాపురంలో మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి ఘటనలో కేసు నమోదులో ఆలస్యం జరిగిందని విమర్శించారు. నెల్లూరు జిల్లా కావలిలో గిరిజన మహిళపై దాడి ఘటనలో నిందితుల అరెస్టులు జరగకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

**సోషల్ కేసులపై అభ్యంతరం**

ప్రభుత్వాన్ని ప్రశ్నించే సోషల్ మీడియా కార్యకర్తలపై మాత్రం వెంటనే కేసులు నమోదు చేసి నాన్‌బెయిలబుల్ సెక్షన్లు విధిస్తున్నారని జగన్ ఆరోపించారు. యూట్యూబర్లు కేవీఆర్, రావణ్‌పై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ చట్ట ప్రక్రియలను పక్కనపెట్టారని విమర్శించారు.



# కొత్త ప్రయోగం

**జనసేన పదవుల భర్తీలో పారదర్శక విధానం**

**యువతకు ఎక్కువగా అవకాశాలు**

**నయా రాజకీయ సంస్కృతికి నాంది**

రాజకీయాల్లో కొత్త ఒరవడిని తీసుకొచ్చే దిశగా జనసేన పార్టీ మరో కీలక అడుగు వేసింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవుల కోసం దరఖాస్తులను స్వీకరించి, పారదర్శక ఎంపిక విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియకు కార్యకర్తలు, యువత నుంచి విశేష స్పందన లభించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి, సమాచార సేకరణ కమిటీల కేంద్ర కార్యాలయ సమన్వయకర్త తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. రాజకీయాల్లో అవకాశాలు కొద్దిమందికే పరిమితం కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా ఈ విధానాన్ని రూపొందించినట్లు చెప్పారు.

**అన్ని విభాగాలకు భారీ స్పందన**

పార్టీ అనుబంధ విభాగాలు సహా అన్ని స్థాయిల పదవులకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని శివశంకర్ వెల్లడించారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపడం జనసేనపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వారికి, భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలనుకునే వారికి సమాన అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగిందన్నారు.

**పవన్ కళ్యాణ్ పరిశీలన తర్వాతే నిర్ణయం**

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు సేకరించిన దరఖాస్తులను పార్టీ కేంద్ర కార్యాలయానికి అందజేయనున్నారు. అనంతరం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రతి దరఖాస్తును పరిశీలిస్తారని తెలిపారు. అవసరమైన చర్చలు, సమావేశాల తర్వాత అన్ని విభాగాలకు పదవులను ఖరారు చేస్తారని చెప్పారు. ఈ విధానం భారత రాజకీయాల్లో అరుదైన సంస్కరణగా నిలుస్తుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. మార్పు మన నుంచే ప్రారంభం కావాలనే భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. పారదర్శకత, బాధ్యత, అవకాశాల సమానత్వం అనే మూడు సూత్రాల ఆధారంగా జనసేన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

**సముద్రంలో కొనసాగుతోన్న గాలింపు**

**ఒకరు సేఫ్, మిగతా వారి కోసం వేట**

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి జూలై 1న వేటకు వెళ్లిన మెకనైజ్డ్ బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురు గల్లంతవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బోటు యజమాని కర్రి చిన్నను ఆదివారం ఉదయం ఓ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించింది. మిగిలిన ఆరుగురి కోసం భారత నౌకాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా సముద్రంలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గల్లంతైన వారిలో ఐదుగురు విజయనగరం జిల్లా ముక్కాం గ్రామానికి చెందినవారు. ఒకరు భీమునిపట్నం ప్రాంతానికి చెందినట్లు అధికారులు తెలిపారు.

**వాతావరణం, సాంకేతిక సమస్య అనుమానం**

మత్స్యకారులు శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో మాట్లాడి గంగవరం సమీపంలో ఉన్నామని, గంటలో తీరానికి చేరుకుంటామని చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత వారి ఫోన్లు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు అధికారులను ఆశ్రయించారు. రక్షించబడిన కర్రి చిన్న తెలిపిన వివరాల ప్రకారం, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పాటు బోటులో సాంకేతిక లోపం ఏర్పడింది. బోటు మునిగే పరిస్థితి రావడంతో ముగ్గురు సమీపంలో కనిపించిన సరుకు రవాణా నౌక వైపు ఈదేందుకు ప్రయత్నించగా ఒకరినొకరు విడిపోయినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది.



**ప్రభుత్వం అప్రమత్తం**

ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించి గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరును వినియోగించి గల్లంతైన వారిని గుర్తించాలని సూచించారు. సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. సాంకేతిక కారణాలతో సముద్రంలో మత్స్యకారుల బోటు నిలిచిపోవడం, ఆ తర్వాత వారితో సంబంధాలు తెగిపోవడం అత్యంత బాధాకరమన్నారు.

**వాతావరణ హెచ్చరికలు**

అల్పపీడన ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యశాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం రాత్రివేళ కూడా గాలింపు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాత్రం తమ ప్రియమైన వారు క్షేమంగా తిరిగి రావాలని ఆశతో ఎదురుచూస్తున్నారు.

### గాలింపు ముమ్మరం చేయాలి: పవన్ కళ్యాణ్



విశాఖపట్నం హార్బర్ నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి గాలింపు చర్యల వివరాలు తెలుసుకున్నారు. మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం సమన్వయంతో సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రక్షణ చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, వారిని క్షేమంగా రక్షించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు.

## తిరుచానూరులో శ్రీ సుందరరాజస్వామి అవతార మహోత్సవాలకు శ్రీకారం



తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధమైన శ్రీ సుందరరాజస్వామివారి వార్షిక అవతార మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. మధ్యాహ్నం శాస్త్రోక్తంగా మహాభిషేకం నిర్వహించగా, సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో దివ్య విహారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం హనుమంత వాహనసేవ నిర్వహించనున్నారు. పురాణ, చారిత్రక విశిష్టత కలిగిన ఈ మహోత్సవాలను టీటీడీ ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తోంది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## శ్రీవారి చెంతకు కాలినడకన 116 ఏళ్ల మహిళ

**భక్తురాలి భక్తికి తిరుమల వందనం... నవనీతమ్మకు ప్రత్యేక వీఐపీ దర్శనం**



116 ఏళ్ల వయసులో అలిపిరి కాలినడక మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న తమిళనాడుకు చెందిన నవనీతమ్మ భక్తి అందరినీ కదిలించింది. కుటుంబ సభ్యుల సహాయంతో శ్రీవారి దర్శనం కోసం ఆమె చేసిన పాదయాత్రకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయ్యాయి. తొలుత ఆమె కర్ణాటకకు చెందిన లక్ష్మవ్వ అని ప్రచారం జరిగినా, తర్వాత టీటీడీ అధికారులు ఆమె తమిళనాడుకు చెందిన నవనీతమ్మ అని నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె తిరుపతిలోని జీవకోన ప్రాంతంలో బంధువుల వద్ద ఉన్నట్లు గుర్తించారు. భక్తి ముందు వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 116 ఏళ్ల వయసులోనూ కాలినడకన తిరుమలకు చేరుకోవడం అసాధారణమైన విషయమని కొనియాడారు. నవనీతమ్మ భక్తిని గుర్తించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెంటనే స్పందించారు. భక్తురాలి వివరాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన తర్వాత విజిలెన్స్ అధికారులు ఆమెను గుర్తించారు. అనంతరం నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. నవనీతమ్మ పాదయాత్ర ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వందేళ్లు దాటిన వయసులోనూ శ్రీవారి దర్శనం కోసం ఆమె చూపిన పట్టుదల అనేక మందిని భావోద్వేగానికి గురిచేసింది.

# పీకేకి తొలి పరీక్ష

**ఎన్నికల బరిలో ప్రశాంత్ కిశోర్**

**బాంకీపూర్‌లో రాజకీయ పరీక్ష**

**ఉపఎన్నికపై దేశవ్యాప్త ఆసక్తి**



ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు తొలిసారి స్వయంగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. బీహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో జన సురాజ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. పూర్తి నిజాయితీతో, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే లక్ష్యంతో ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన సురాజ్ పార్టీకి ఈ ఉపఎన్నిక అత్యంత కీలకంగా మారింది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఇప్పుడు బాంకీపూర్ ఉపఎన్నిక ద్వారా పార్టీ బలం, ప్రజల్లో ఉన్న ఆదరణ పరీక్షకు రానుంది. ఈ ఎన్నికలో ఫలితం ప్రశాంత్ కిశోర్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బీజేపీకి బలమైన కోట**

బాంకీపూర్ నియోజకవర్గం చాలా కాలంగా బీజేపీకి కంచుకోటగా ఉంది. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నవీన్ ఐదోసారి వరుస విజయాన్ని నమోదు చేశారు. ప్రత్యర్థి ఆర్జేడీ అభ్యర్థిపై 51 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. జన సురాజ్ పార్టీ అభ్యర్థి వందన కుమారి మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో బీజేపీకి బలమైన రాజకీయ ఆధారం ఉండటంతో ప్రశాంత్ కిశోర్‌కు ఇది కఠిన సవాల్‌గా మారింది.

**ఉపఎన్నికపై పీకే వ్యాఖ్యలు**

ఈ ఉపఎన్నికను కేవలం ఒక స్థానానికి జరిగే ఎన్నికగా కాకుండా బీహార్ ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబంగా చూడాలని ప్రశాంత్ కిశోర్ అన్నారు. గత ఆరు నెలలుగా అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు, పాలనా విధానం, ప్రజలతో వ్యవహరించే తీరు, ప్రభుత్వ ప్రతిష్ఠపై ఇది ప్రజాభిప్రాయ సేకరణ లాంటిదని పేర్కొన్నారు.

**బీజేపీ ధీమా**

ప్రశాంత్ కిశోర్ ప్రకటనపై బీజేపీ కూడా వెంటనే స్పందించింది. బాంకీపూర్ ఉపఎన్నికలో రికార్డు మెజారిటీతో విజయం సాధిస్తామని బీజేపీ నాయకత్వం ధీమా వ్యక్తం చేసింది. ఎవరు పోటీ చేసినా బీజేపీ విజయాన్ని అడ్డుకోలేరంది. ఎన్నికల సంఘం జూలై 6న నోటిఫికేషన్ విడుదల చేయనుండగా, జూలై 13 వరకు నామినేషన్లు స్వీకరించనుంది. జూలై 30న పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఫలితం బీహార్ రాజకీయాల్లో చర్చకుదారితీయనుంది.

## ఖమేనీ అంత్యక్రియల్లో అమెరికా వ్యతిరేక నినాదాలు

### టెహ్రాన్‌లో ఉద్రిక్త వాతావరణం, ప్రసంగాలతో ఉద్రిక్తత

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు టెహ్రాన్‌లో భారీ జనసందోహం మధ్య జరిగాయి. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి నివాళు లర్పించారు. నల్ల దుస్తులు ధరించిన ప్రజలు ఖమేనీ చిత్రాలతో కూడిన జెండాలు, బ్యానర్లు పట్టుకుని పాల్గొన్నారు. అంత్యక్రియల సందర్భంగా వేదికపై మాట్లాడిన ఓ కవి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యల అనంతరం సభకు హాజరైన కొందరు అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమం మొత్తం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. ఖమేనీ మరణానికి అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపై తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తూ నినాదాలు వినిపించాయి. ఈ పరిణామాలు ఉద్రిక్తంగా ఉన్న మధ్యప్రాచ్య పరిస్థితులను మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

# వైద్యులూ మనుషులే

### దేవుళ్లకు పడుతున్న భూతాలు
### మానసిక సమస్యలతో డాక్టర్లు సతమతం
### వైద్యుల్లో పెరుగుతున్న డిప్రెషన్
### ప్రాణాలకే ముప్పుగా మారుతున్న ఒత్తిడి



అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించే వైద్యులు ఎప్పుడూ ధైర్యంగా ఉంటారని చాలామంది భావిస్తారు. కానీ వైద్యులు కూడా సాధారణ మనుషులే. ఉద్యోగ ఒత్తిడి, బాధ్యతలు, వ్యక్తిగత సమస్యలు వారినీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. చాలామంది వైద్యులు డిప్రెషన్‌తో బాధపడుతున్నా బయటకు చెప్పలేక మౌనంగా భరిస్తుంటారు. తమ సమస్య బయటపడితే ఉద్యోగం, ప్రతిష్ఠ, లైసెన్స్‌పై ప్రభావం పడుతుందనే భయం వారిలో ఎక్కువగా ఉంటుంది. అందుకే సహాయం కోరాల్సిన సమయంలో కూడా వెనక్కి తగ్గుతుంటారు.

**ఆందోళన కలిగించే గణాంకాలు**

భారతీయ మానసిక వైద్య పరిశోధనల్లో వెల్లడైన వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలోని సుమారు 30 శాతం మంది వైద్యులు జీవితంలో ఏదో ఒక దశలో డిప్రెషన్‌ను ఎదుర్కొంటున్నారు. దాదాపు 17 శాతం మంది ఆత్మహత్య గురించి ఆలోచించిన సందర్భాలు ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రతి పది వేల మంది వైద్యుల్లో సుమారు నలుగురు ఆత్మహత్య చేసుకుంటున్నారని నివేదికలు చెబుతున్నాయి. సాధారణ ప్రజలతో పోలిస్తే వైద్యుల్లో ఆత్మహత్య ప్రమాదం ఎక్కువగా ఉండటం ఆరోగ్య రంగానికి పెద్ద హెచ్చరికగా నిపుణులు భావిస్తున్నారు.

**డిప్రెషన్‌కు దారితీసే కారణాలు**

వైద్యులపై నిరంతర ఒత్తిడి ఉంటుంది. రోగుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత, రాత్రింబవళ్లు పని చేయడం, నిద్రలేమి, రోగి మరణాన్ని ప్రత్యక్షంగా చూడాల్సిన పరిస్థితులు, సహచరులు, సీనియర్ వైద్యులతో తలెత్తే విభేదాలు, ఒంటరితనం, తమపై తామే ఎక్కువ అంచనాలు పెట్టుకోవడం వంటి అంశాలు మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రతి నిర్ణయం ప్రాణాలతో ముడిపడి ఉండటంతో చిన్న తప్పు జరిగినా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతుంటారు.

**గుర్తించాల్సిన హెచ్చరిక సంకేతాలు**

డిప్రెషన్‌లో ఉన్న వైద్యులు చాలాసార్లు తమ భావాలను దాచిపెడతారు. అందరి నుంచి దూరంగా ఉండడం, చిరాకు, కోపం పెరగడం, ప్రవర్తనలో మార్పులు కనిపించడం, పనిలో ఏకాగ్రత తగ్గడం, తరచూ గైర్హాజరు కావడం, నిర్ణయాల్లో అస్థిరత, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం, నిద్ర అలవాట్లు మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. వీటిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పరిస్థితిని మెరుగుపర్చే అవకాశం ఉంటుంది.

**సహాయం కోరడంలో అడ్డంకులు**

మానసిక వైద్యుడిని సంప్రదిస్తే సమాజంలో అపోహలు ఏర్పడతాయనే భయం వైద్యుల్లో ఎక్కువగా ఉంటుంది. తమకు చికిత్స చేసిన విషయం గోప్యంగా ఉండదనే అనుమానం కూడా వారిని వెనక్కి నెడుతుంది. కొందరు స్వయంగా మందులు వాడటం, తామే చికిత్స చేసుకోవడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి మద్యం లేదా ఇతర వ్యసనాల వైపు వెళ్లడం వంటి ప్రమాదకర మార్గాలను ఎంచుకుంటారు. ఇది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది.

**పరిష్కారమే ప్రాణరక్షణ**

డిప్రెషన్‌ను బలహీనతగా కాకుండా ఒక ఆరోగ్య సమస్యగా చూడాలని మానసిక ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వైద్యులకు గోప్యతతో కూడిన మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి. ఆస్పత్రుల్లో కౌన్సెలింగ్ వ్యవస్థలు బలోపేతం కావాలి. సహచరులు కూడా లక్షణాలను గుర్తించి ప్రోత్సహించాలి. వైద్యుడు అయినా, సాధారణ వ్యక్తి అయినా చికిత్స ఒకే ప్రమాణాలతో అందాలని నిపుణులు సూచిస్తున్నారు. వైద్యుల మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుంది. అందుకే వైద్యుల ఆరోగ్యాన్ని కాపాడటం అంటే సమాజ ఆరోగ్యాన్ని కాపాడటమే.

# వారసుడెక్కడ



### ఓవైపు తండ్రి అంత్యక్రియలు
### మరోవైపు బయటకు రాని మొజ్తబా!
### ఖమేనీ అంత్యక్రియల్లో ముగ్గురు కుమారులు

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు టెహ్రాన్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు నివాళులర్పించేందుకు తరలివస్తున్నారు. టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ ముసల్లాలో జరిగిన ప్రార్థనల్లో ఖమేనీ ముగ్గురు కుమారులు మొస్తఫా, మేసామ్, మసూద్ పాల్గొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘలీబఫ్, రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నతాధికారులు కూడా కార్యక్రమంలో హాజరయ్యారు.

**మొజ్తబా గైర్హాజరుతో చర్చ**

అంత్యక్రియల్లో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం ఖమేనీ వారసుడిగా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ గైర్హాజరే. తండ్రి మరణం తర్వాత ఇరాన్ అత్యున్నత పదవిని చేపట్టిన ఆయన ఇప్పటి వరకు బహిరంగంగా కనిపించలేదు. అంత్యక్రియల్లో కూడా పాల్గొనకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారు, ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

**భద్రతా కారణాలే ప్రధాన కారణమా?**

మొజ్తబా ఖమేనీ ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ కథనాలు పేర్కొంటున్నాయి. కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖంపై కూడా గాయాలయ్యాయని సమాచారం. భద్రతా సంస్థల సూచనల మేరకే ఆయనను ప్రజల ముందుకు రానివ్వడం లేదని ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయెల్ నుంచి ముప్పు కొనసాగుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఆయన బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు విదేశీ మీడియా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**కుటుంబ సభ్యులతో పాటు శవపేటికలు**

అలీ ఖమేనీ శవపేటికను ఇరాన్ జాతీయ జెండాతో అలంకరించారు. ఆయనతో పాటు దాడిలో మరణించిన నలుగురు కుటుంబ సభ్యుల శవపేటికలను కూడా అంత్యక్రియల ప్రాంగణంలో ఉంచారు. వారిలో 14 నెలల చిన్నారి మనవరాలు కూడా ఉండటం విషాదాన్ని మరింత పెంచింది. మసూద్ ఖమేనీ ప్రార్థనల సమయంలో కన్నీళ్లు తుడుచుకుంటూ కనిపించిన దృశ్యాలు దేశవ్యాప్తంగా భావోద్వేగాన్ని రేకెత్తించాయి.

**జూలై 9న తుది ఖననం**

అలీ ఖమేనీకి నివాళుల కార్యక్రమాలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. టెహ్రాన్‌తో పాటు పలు నగరాల్లో అంతిమయాత్రలు నిర్వహించనున్నారు. అనంతరం ఇరాక్‌లోని పవిత్ర షియా క్షేత్రాల మీదుగా స్వస్థలం మష్హాద్‌కు తీసుకెళ్లి జూలై 9న ఇమామ్ రెజా దర్గా వద్ద ఖననం చేయనున్నారు. తుది కార్యక్రమంలో అయినా మొజ్తబా ఖమేనీ పాల్గొంటారా అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఆయన భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఇరాన్ వర్గాలు చెబుతున్నప్పటికీ, అధికారిక ధృవీకరణ మాత్రం ఇంకా వెలువడలేదు.

# భారీ వర్షాల హెచ్చరిక

### తెలుగు రాష్ట్రాలకు అలర్ట్
### మత్స్యకారులకు కీలక సూచనలు
### వాయుగుండంగా మారిన అల్పపీడనం

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఇది బాలాసోర్‌కు ఆగ్నేయ దిశగా సుమారు 50 కిలోమీటర్లు, చాంద్‌బలికి ఈశాన్యంగా 60 కిలోమీటర్లు, దిఘాకు దక్షిణ నైరుతి దిశగా 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి-దిఘా మధ్య ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

**తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాల అవకాశం**

వాయుగుండం ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

**మత్స్యకారులకు హెచ్చరిక**

సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న వారు వెంటనే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.

**తెలంగాణలో ఇప్పటికే వర్షాలు**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు నమోదయ్యాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లిలో అత్యధికంగా 4.1 సెంటీమీటర్ల వర్షపాతం



నమోదైంది. సిర్పూర్ (టి), వాంకిడి ప్రాంతాల్లో 3.8 సెంటీమీటర్లు, ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చాప్రాలలో 3.5 సెంటీమీటర్లు, కామారెడ్డి జిల్లాలో 3.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**ఈ జిల్లాలకు ప్రత్యేక అలర్ట్**

ఆదివారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మిగిలిన జిల్లాల్లో కూడా అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వాయుగుండం ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# జీవాయుధాలతో రష్యా దాడులు



### ఉక్రెయిన్ సంచలన ఆరోపణలు
### ఆంత్రాక్స్ సమాధుల కలకలం

రష్యాపై ఉక్రెయిన్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేసింది. ఆక్రమిత ప్రాంతాల్లో ఆంత్రాక్స్ వ్యాధి సోకిన పశువుల మృతదేహాలను భద్రతా ప్రమాణాలు పాటించకుండా పూడ్చిపెడుతు న్నారని ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ చర్యల వల్ల భవిష్యత్తులో ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనిని దీర్ఘకాలిక జీవ ప్రమాదంగా అభివర్ణిస్తూ రష్యా చర్యలు జీవ ఉగ్రవాదంగా పరిగణించాల్సి ఉంటుందని ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలపై రష్యా నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు.

**ఖేర్సాన్ ప్రాంతంలో ఎక్కువ ప్రమాదం**

ఉక్రెయిన్ తెలిపిన వివరాల ప్రకారం ఆక్రమిత ఖేర్సాన్ ప్రాంతంలో దాదాపు 50 పశువుల సమాధి ప్రాంతాలు ఉన్నాయి. వాటిలో సుమారు పది ప్రాంతాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని పేర్కొంది. అస్కానియా-నోవా, స్కడోవ్స్క్, జలిజ్ని పోర్ట్ ప్రాంతాల్లో ఈ సమాధులు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. కొన్ని సమాధులు గ్రామాలు, వ్యవసాయ భూములు, తాగునీటి బావులకు అత్యంత సమీపంలో ఉండటంతో స్థానిక ప్రజలు ప్రమాదంలో ఉన్నారని తెలిపింది.

**ఆంత్రాక్స్ వ్యాప్తిపై ఆందోళన**

ఆంత్రాక్స్ వ్యాధి కారకాలు నేలలో దశాబ్దాల పాటు జీవించి ఉండే సామర్థ్యం కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. భూగర్భ జలాల్లోకి చేరితే రెండేళ్ల వరకు నీటిలో కూడా చురుకుగా ఉండే అవకాశం ఉందని ఉక్రెయిన్ పేర్కొంది. మృతదేహాలను దహనం చేయకుండా నేరుగా పూడ్చిపెట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి ప్రమాదం మరింత పెరుగుతుందని ఆరోపించింది. ఈ ప్రాంతాల్లో సరైన కంచెలు, రక్షణ ఏర్పాట్లు కూడా లేవని పేర్కొంది.

**అంతర్జాతీయ దృష్టి ఈ ఆరోపణలపైనే**

రష్యా ఇప్పటికే రసాయన ఆయుధాల వినియోగంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ తాజా ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి నిషేధిత రసాయన పదార్థాల వినియోగానికి సంబంధించిన వేలాది ఘటనలను నమోదు చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. ఇప్పుడు ఆంత్రాక్స్ సమాధుల అంశాన్ని కూడా అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈ ఆరోపణలను రష్యా ఇప్పటివరకు అంగీకరించలేదు. స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు ద్వారా మాత్రమే ఈ ఆరోపణల నిజానిజాలు తేలే అవకాశం ఉంది.

**ప్రజారోగ్యానికి భారీ ముప్పు**

ఆంత్రాక్స్ సోకితే ప్రారంభంలో సాధారణ జ్వరం లక్షణాలు కనిపించినా, తీవ్ర దశలో రక్త వాంతులు, శ్వాస సమస్యలు, అవయవ వైఫల్యం, సెప్టిక్ షాక్ వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఉక్రెయిన్ హెచ్చరించింది. ఆక్రమిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొంది. దీనిని అంతర్జాతీయ సమాజం అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# రెండ్రోజులు ఆగండి.. ఇరాన్ సంగతి తేల్చేస్తా

### ట్రంప్ లేటెస్ట్ వార్నింగ్
### బెదిరింపులకు భయపడం
### అంత సీన్ లేదంటూ కౌంటర్లు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలను పెంచాయి. ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన దేశ అత్యున్నత నాయకత్వాన్ని అమెరికా కోరుకుంటే "ఒక్క దాడితో అంతమొందించగలదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చలు కొనసాగించే అవకాశం ఉండాలనే ఉద్దేశంతో అలాంటి చర్య తీసుకోవడం లేదని కూడా చెప్పారు.

**ఇరాన్ ఘాటైన ప్రతిస్పందన**

ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం ద్వారా అమెరికాపై విమర్శలు గుప్పించింది. మనుషులను చంపడం సాధ్యమే కానీ భావజాలాన్ని చంపడం ఎవరి వల్లా కాదని పేర్కొంది. ఖమేనీని హత్య చేశారని భావించినా, ఆయన ఆలోచనలు ప్రపంచమంతా వ్యాపించాయని వ్యాఖ్యానించింది. సువాసన సీసాను పగులగొట్టినా దాని పరిమళాన్ని ఆపలేనట్లే భావాలను కూడా నిర్మూలించడం అసాధ్యమని ఇరాన్ పేర్కొంది.

**అమెరికాపై సూటి విమర్శలు**

ఇరాన్ తన ప్రతిస్పందనలో అమెరికా చరిత్ర, నాగరికతపై కూడా విమర్శలు చేసింది. నాగరికత, చరిత్ర, గౌరవం లేని దేశానికి ఇలాంటి విలువలు అర్థం కావని పేర్కొంది. ట్రంప్ వ్యాఖ్యలను కేవలం రాజకీయ హెచ్చరికగా కాకుండా ఒక దేశ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నంగా అభివర్ణించింది. ట్రంప్ వ్యాఖ్యలు, ఇరాన్ ప్రతిస్పందనతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరోసారి ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న భద్రతా సవాళ్ల మధ్య ఈ మాటల యుద్ధం కొత్త ఆందోళనలకు కారణమవుతోంది.

**ఖమేనీ అంత్యక్రియలకు భారీ హాజరు**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరుగుతున్న ఖమేనీ అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. పలువురు కన్నీటి నివాళులు అర్పించగా, అనేక దేశాల ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. జూలై 9న అధికారిక ఖననం నిర్వహించనున్నట్లు ఇరాన్ ప్రకటించింది.

# బీజేపీ ముక్త రాముడే లక్ష్యం

### కాశీ, మధుర నెక్ట్స్ వెలుగులోకి.. 'రామ్ రక్ష' ఉద్యమానికి శ్రీకారం
### ఉద్ధవ్ థాకరే సంచలన వ్యాఖ్యలు



అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో శివసేన.. యూబీటీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేముంబైలో "రామ్ రక్ష" ఉద్యమాన్ని ప్రారంభించారు. దాదర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హనుమాన్ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాముడి పేరుతో రాజకీయాలు చేసే వారికి ఆలయ పవిత్రతను కాపాడే హక్కు లేదని విమర్శించారు. రాముడి పేరును వినియోగించి అధికారంలోకి వచ్చినవారే ఇప్పుడు హిందుత్వాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. "అయోధ్య ఒక ట్రైలర్ మాత్రమే.. కాశీ, మధుర ఇంకా మిగిలే ఉన్నాయి" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ ఉద్ధవ్ థాకరే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వస్తే కాశీ, మధురలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలు ఎక్కడ జరిగినా ప్రశ్నించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆలయాల పేరుతో ఎలాంటి అక్రమాలు జరిగినా వాటిపై నిష్పాక్షిక విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఉద్ధవ్ థాకరేబీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హిందుత్వ పేరుతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు అదే హిందుత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నా రని ఆరోపించారు. బీజేపీ ప్రభావం లేని హిందుత్వం కావాలని కూడా వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ఉద్యమంలో శివసేన పాత్ర ఎంతో కీలకమని ఉద్ధవ్ పేర్కొన్నారు. బాలా సాహెబ్ ఠాక్రే హిందువులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. 1993 ముంబై పేలుళ్ల తర్వాత హిందువుల్లో ధైర్యాన్ని నింపిన నాయకుడు బాలాసాహెబ్ అని చెప్పారు. రామాలయ నిర్మాణంలో కూడా శివసేన కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

**దర్యాప్తు కొనసాగుతున్న కేసు**

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసిన అధికారులు నగదు, నగలను స్వాధీనం చేసుకున్నారు.

కేసు దర్యాప్తు కొనసాగుతోందని అధికా రులు తెలిపారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపు తున్న వేళ ఉద్ధవ్ థాకరేచేసిన వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. హిందువుల విశ్వాసాన్ని కాపాడేందుకు నిజాలు వెలు గులోకి రావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 06-07-2026 సోమవారం రాశి ఫలితాలు

శ్రీ మహాగణాధిపతియే నమః
శ్రీ మహా సరస్వతియే నమః శ్రీ గురుభ్యోనమః

**మేష రాశి:** సంతానం అభివృద్ధికై అప్పు చేసినా సంతోషంగానే ఉంటారు. వైద్య, రక్షణ రంగాలలో ఉండే వారికి శ్రమ అధికంగా ఉన్నప్పటికీ సు దినం. కుటుంబ సౌఖ్యం కలుగును. నిగూఢ శత్రువులను ఓర్పుగానే గమనిస్తూ ఉండండి. తొందరపడి మాట్లాడకండి. రావి చెట్టు ప్రదక్షణ, రుద్రాభిషేకం మేలు చేస్తుంది.

వృషభ రాశి : విద్యార్థుల మనోభీష్టానికి తగినట్లుగా ఉండును. దైవ దర్శనానికి ఆస్కారం. అన్ని రంగాలలో ఉండే వారికి పనులు సానుకూలం. కోర్టు వ్యవహారాలు ఉన్నవారికి సామాన్యంగా ఉంది. సాయిబాబా దర్శనం, శనగలు దానం మేలు చేస్తాయి.

**మిధున రాశి:** కుటుంబ, వాహన సౌఖ్యం కలుగును. బంధుమిత్ర లాభం. విద్యార్థులకు సుదినమే. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ప్రశంసలు పొందే సుదినం. వ్యాపారస్తులకు నూతన పరిచయాల వల్ల లాభదాయకం. ఇన్సూరెన్స్ ఏజెంట్లకు లక్ష్మీ కటాక్షం. పేదలకు పెరుగన్నం దానం చేయటం వల్ల గ్రహదోష తీవ్రత తగ్గును.

**కర్కాటక రాశి:** అన్ని రంగాలలో ఉండే వారికి ధైర్యం పెరిగి, గౌరవం ను పొందుతారు. దైవ దర్శనానికి వెళతారు. మితమైన ఆహారాన్ని తీసుకోగలరు. మెడికల్ రిప్రజెంట్స్ కు సు దినం.

**సింహరాశి:** ఉద్యోగస్తులకు పనికి తగిన గుర్తింపు లోపిస్తుంది. చిరు వ్యాపారస్తులకు కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. విద్యార్థులు కు సు దినం. నూనె పదార్థాలు తక్కువగా తీసుకోగలరు.

**కన్య రాశి:** ఉద్యోగ మార్పునకు అనుకూలమైన రోజు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవాలి. రాత్రి ప్రయాణాల పట్ల జాగ్రత్త అవసరం. హోటల్ రంగంలో ఉండే వారికి ప్రోత్సాహకమైన సుదినం. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోకపోవడం మంచిది.

**తులారాశి:** డ్రైవింగ్ పట్ల శ్రద్ధ పెంచుకోవాలి. మీ వాహనం కాగితాలను సరి చూసుకోగలరు. సహచర ఉద్యోగులతో ఓర్పు, సఖ్యతను పెంచుకుంటూ ఉండగలరు. జీవిత భాగస్వామి సలహా మీకు మేలు చేస్తుంది.

**వృశ్చిక రాశి:** సమాజంలో గౌరవం పెరుగును. పుణ్యక్షేత్ర దర్శనముకు ఆస్కారం ఉన్నది. వ్యాపారస్తులకు రాని బాకీలు వస్తాయి. తండ్రి సలహా, సంప్రదింపు మేలు చేస్తుంది. అప్పు కోసం వెతికే వారికి సు దినం.

**ధనస్సు రాశి:** మిత్రులతో బంధువులతో సఖ్యతను పెంచుకోగలరు. నూనె పదార్థాలను తక్కువగా తీసుకోగలరు. విద్యార్థుల అభీష్టానికి అనుకూలమైన దినము. వ్యాపారస్తులు లౌక్యంగా మాట్లాడటం వలన వ్యాపార వృద్ధి కలుగును. ప్రజా జీవితంలో ఉండే వారికి శ్రమ కొంచెం ఉన్నా పేరు బాగా వస్తుంది.

**మకర రాశి:** ఓర్పు కలిగి ఉంటే ఆలస్యంగా నైనా పనులు అయ్యేందుకు గ్రహ స్థితి అనుకూలంగానే ఉంది. వాహన సౌఖ్యం, కళా రంగంలో ఉండే వారికి ప్రోత్సాహకమైన దినము. భూ లావాదేవీలకు అనుకూలం. గృహిణిలు స్వగృహము గురించి మీ కుటుంబ సభ్యులతో చర్చించటం వలన సానుకూలమైన ఫలితాన్ని పొందే ఆస్కారం ఉన్నది.

**కుంభ రాశి:** శారీరక బడలిక ను గమనించగలరు. భార్య సఖ్యత పెరుగును. శారీరక బడలికను గమనిస్తారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు మీ వస్తువులు జారవిడుచుకునే అవకాశం ఉన్నది జాగ్రత్త సుమా ! ముఖ్యమైన పనులను ఒకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

**మీన రాశి:** ఈరోజు విద్యార్థులకు ఆశించిన కాలేజీలో సీటు వచ్చేందుకు ఆస్కారం ఉంది. పుణ్యక్షేత్ర దర్శనం కలుగును. రాని బాకీలు వస్తాయి. నేటి పెళ్లిచూపులు పెళ్లి పీటల దాకా తీసుకెళ్తాయి. కోర్టు తీర్పులు సంతోషాన్ని ఇస్తాయి.



టీటీడీ అనుబంధ సంస్థ సమరసత సిద్ధాంతి
'దైవజ్ఞ ' పులిపాక చంద్ర శేఖర శర్మ
శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005



# కబళిస్తున్న డిజిటల్ వ్యసనం.. జీవితాలు ఛిన్నాభిన్నం

ఉదయం కళ్లు తెరవగానే అలారం ఆపడానికి ఫోన్ చేతిలోకి తీసుకుంటాం. అక్కడితో మొదలవుతుంది మన రోజువారీ ప్రయాణం. వాట్సాప్ నోటిఫికేషన్లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఎక్కడో జరిగిన దారుణాలు, ప్రమాదాల వార్తలు... ఇలా నిమిషాల వ్యవధిలోనే మన మెదడులోకి వందల రకాల సమాచారం దూసుకుపోతోంది. బెడ్‌రూమ్ నుంచి బయటపడకముందే ఒక రకమైన తెలియని అలసట, ఆందోళన మనల్ని ఆవహిస్తున్నాయి. ప్రస్తుతం సమాజం ఒక కంటికి కనిపించని డిజిటల్ మాఫియా చేతిలో చిక్కుకుంది. మనం సమాచార యుగంలో ఉన్నాం కానీ మానసిక ప్రశాంతతను పూర్తిగా కోల్పోతున్నాం. మనుషుల మధ్య ప్రత్యక్ష పరిచయాలు తగ్గిపోయి, కేవలం తెరల వెనుక బంధాలు మాత్రమే మిగులుతున్నాయి.

ప్రస్తుతం సమాజంలో ఒక కొత్త అలవాటు విపరీతంగా పెరిగిపోయింది. సైకాలజీలో దీనిని డూమ్ స్క్రోలింగ్ అంటారు. సోషల్ మీడియాలో నెగెటివ్ వార్తలను, భయపెట్టే పరిణామాలను మనకు తెలియకుండానే గంటల తరబడి స్క్రోల్ చేస్తూ చదవడం దీని ప్రత్యేకత. ఆర్థిక సంక్షోభం, యుద్ధాలు, క్రైమ్ వార్తలు... వీటిని చూస్తూ మన ఒక రకమైన అభద్రతా భావంలోకి వెళ్లిపోతున్నాం. దీనికి తోడు రీల్స్, షార్ట్స్‌లో ఇతరుల లగ్జరీ జీవితాలను చూస్తూ, మన జీవితంలో ఏదో వెలితి ఉందనే ఫోమో, ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ అనే తీవ్ర మానసిక ఆందోళనతో సతమతమవుతున్నాం. ఈ పరిస్థితి వ్యక్తులను మానసికంగా ఎంతగానో కుంగదీస్తోంది. ఇది ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. పూర్వ కాలం నుంచి వచ్చిన సమస్యే. అయితే అప్పుడు పరిస్థితులు వేరు, ఇప్పుడు సిచ్యుయేషన్ వేరు. మానవ పరిణామ క్రమంలో మన పూర్వీకులు అడవుల్లో క్రూర జంతువుల నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి ఎప్పుడూ ప్రమాదాల గురించే ఆలోచించేవారు. వాటిని తప్పించుకోవడానికి, తమను తాము రక్షించుకోవడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు. దీనినే సైకాలజీలో నెగెటివ్ బయాస్ అంటారు. అయితే ఇవాళ అడవులు లేవు, క్రూర జంతువుల భయం లేదు. కానీ మన ఫోన్‌లో వచ్చే నెగెటివ్ న్యూస్ క్లిక్స్‌నే మన మెదడు ఒక ప్రమాదంలా భావించి మనల్ని ఎప్పుడూ అలర్ట్‌గా ఉంచుతుంది. ఇది తీవ్రమైన ఆందోళనకు దారి తీస్తోంది.

## ఆరోగ్యంపై డిజిటల్ పంజా

సోషల్ కంపారిజన్ థియరీలో లియోన్ ఫెస్టింగర్ చెప్పినట్టు మనుషులు ఎప్పుడూ తమను ఇతరులతో పోల్చుకొని తమ స్థాయిని అంచనా వేసుకుంటారు. అప్పట్లో పోలిక కేవలం పక్కింటి వారితోనో, బంధువులతోనో ఉండేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యమా అని, ప్రపంచంలో ఉన్న అందరితోనూ మనల్ని మనం పోల్చుకుని డిప్రెషన్‌లోకి వెళ్తున్నాం. నిరంతరం ఆన్‌లైన్ ప్రపంచంలో గడపడం వల్ల మెదడులో డోపమైన్ అనే హార్మోన్ విడుదలయ్యే విధానం మారిపోతుంది. ప్రతి లైక్, ప్రతి నోటిఫికేషన్ మనకు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తూ, లాంగ్ టర్మ్ ప్రశాంతతను పూర్తిగా దూరం చేస్తున్నాయి. ఈ డిజిటల్ మాఫియా కేవలం మానసిక శాంతిని మాత్రమే కాదు, శారీరక ఆరోగ్యాన్ని కూడా పూర్తిగా గుల్ల చేస్తోంది. గంటల తరబడి స్క్రీన్ల వైపు చూడటం వల్ల చిన్న వయసులోనే కంటి సమస్యలు, తీవ్రమైన తలనొప్పి వస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి. నిద్రపోయే ముందు కూడా ఫోన్లు వాడటం వల్ల నిద్రలేమి... ఇన్సోమ్నియా బారిన పడుతున్నారు. నిద్ర సరిగ్గా లేకపోవడంతో మరుసటి రోజు చిరాకు, అలసట, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. శరీరాన్ని ఒకే భంగిమలో ఉంచి ఫోన్లు చూడటంతో వెన్నునొప్పి, మెడనొప్పి సర్వసాధారణంగా మారిపోయాయి.

## ముక్కలవుతున్న కుటుంబ బంధాలు..

ఒకప్పుడు రాత్రి పూట కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చుని మాట్లాడుకునేవారు. సుఖదుఃఖాలను పంచుకునేవారు. కానీ ఇప్పుడు ఒకే ఇంట్లో, ఒకే గదిలో నలుగురు ఉన్నా ఎవరి ఫోన్లలో వారు మునిగిపోతున్నారు. భార్యాభర్తల మధ్య సంభాషణలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల చిన్న చిన్న విషయాలకే గొడవలు రావడం, అనుమానాలు పెరగడం, విడాకుల వరకు వెళ్లడం మనం చూస్తున్నాం. బంధుత్వాలు కేవలం వాట్సాప్ స్టేటస్‌లకు, ఫేస్‌బుక్ లైక్‌లకు పరిమితమైపోయాయి. పక్కన ఉన్న మనిషి బాధలో ఉన్నా పట్టించుకోని వారు, సోషల్ మీడియాలో ఎక్కడో ఉన్న వారి కోసం కన్నీళ్లు కార్చే వింత ధోరణి కనిపిస్తోంది. కుటుంబాల్లో ఆత్మీయత మృగ్యమై, యాంత్రికత పెరుగుతోంది. ఈ డిజిటల్ మహమ్మారికి అత్యంత ఘోరంగా బలవుతున్నది నేటి బాల్యమే. ఏడుస్తున్న పిల్లలను ఊరడించడానికి తల్లిదండ్రులు చేతిలో ఫోన్ పెడుతున్నారు. అదే ఇప్పుడు వారి జీవితాలకు శాపంగా మారుతోంది. మైదానాల్లో ఆటలు ఆడాల్సిన పిల్లలు, ఫోన్ స్క్రీన్లకు బందీలుగా మారుతున్నారు. దీనివల్ల వారిలో సృజనాత్మకత నశిస్తోంది. మొండితనం, కోపం, హింసాత్మక ప్రవృత్తి పెరుగుతున్నాయి.

## సైబర్ నేరాల ఉచ్చు

డిజిటల్ మాఫియా కేవలం మన సమయాన్ని మాత్రమే కాదు, మన సొమ్మును, గౌరవాన్ని కూడా దోచేస్తోంది. సోషల్ మీడియా ద్వారా పరిచయమై, ఆ తర్వాత బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే ముఠాలు పెరిగిపోయాయి. నకిలీ ప్రొఫైళ్లతో యువతను ఆకర్షించి, వారి వ్యక్తిగత సమాచారాన్ని, ఫోటోలను సేకరించి వేధిస్తున్నారు. సైబర్ వలలకు చిక్కి ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులు, బెట్టింగ్ సైట్ల మాయాజాలం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఒక చిన్న క్లిక్ మన జీవితాంతం సంపాదించిన సొమ్మును, సమాజంలో ఉన్న గౌరవాన్ని క్షణాల్లో బూడిద చేస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తు మరింత భయంకరంగా మారే ప్రమాదం ఉంది. రాబోయే రోజుల్లో మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు పూర్తిగా నశించిపోయే అవకాశం ఉంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ సాంకేతికతలు పెరిగే కొద్దీ మనుషులు నిజ ప్రపంచాన్ని మర్చిపోయి, ఒక ఊహాజనిత లోకంలోనే బతికేయడానికి ఇష్టపడతారు. దీనివల్ల సమాజంలో నేరాల శాతం పెరుగుతుంది. భావోద్వేగాలు లేని ఒక యాంత్రిక సమాజం తయారవుతుంది. మానసిక రోగుల సంఖ్య విపరీతంగా పెరిగి, ఆసుపత్రుల కంటే మానసిక సంరక్షణ కేంద్రాలే ఎక్కువ శాతంలో వెలిసే దుస్థితి రావచ్చు.

## డిజిటల్ మినిమలిజం అవసరం

నేను గమనించిన వరకు దీనికి పరిష్కారం స్మార్ట్‌ఫోన్‌లను పూర్తిగా పక్కన పెట్టేయడం కాదు. అది ఈ రోజుల్లో సాధ్యం కాదు కూడా కానీ డిజిటల్ మినిమలిజం లేదా మనసుకు ఒక క్రమశిక్షణ అలవాటు చేయడం ముఖ్యం. నిద్ర లేచిన మొదటి ముప్పై నిమిషాలు ఫోన్ ముట్టుకోకూడదనే ఒక కఠినమైన నియమాన్ని పెట్టుకుందాం. ఆ సమయంలో మన ఆలోచనలు ప్రశాంతంగా సాగనిద్దాం. కుటుంబ సభ్యులతో మాట్లాడండి. ప్రకృతిలో కాసేపు నడవండి. మన మానసిక స్థితిని దెబ్బతీసే అకౌంట్లను, న్యూస్ పేజీలను అన్‌ఫాలో చేయడం లేదా మ్యూట్ చేయడం ఎంతైనా మంచిది. ఎన్ని గ్రూప్స్‌లో ఉంటే అంత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అందుకే మీకు అవసరం లేని గ్రూప్స్ నుంచి వెంటనే ఎగ్జిట్ అయిపోండి. స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించి వారంలో ఒకసారైనా స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లడమో లేదా మీకు దగ్గర్లో ఉన్న పార్క్‌లో కూర్చొని మాట్లాడుకోవడమో చేయాలి. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో స్క్రీన్ టైమ్ లాక్ పెట్టుకోవాలి. రోజుకు నిర్దేశిత సమయం కంటే ఎక్కువ సేపు సోషల్ మీడియా వాడకూడదని మనస్ఫూర్తిగా నిశ్చయించుకోవాలి. భోజనం చేసేటప్పుడు, పడుకునే ముందు డైనింగ్ టేబుల్, బెడ్ రూమ్ లలో ఫోన్లను అనుమతించకూడదు. పిల్లల ముందే మనం పుస్తకాలు చదవడం, మొక్కలు నాటడం వంటి పనులు చేస్తే వారు కూడా మనల్ని చూసి మంచి అలవాట్లను నేర్చుకుంటారు.

## భవిష్యత్ బాధ్యత మనదే

టెక్నాలజీ మన జీవితాలను సులువు చేయాలి కానీ, మన మనశ్శాంతిని శాసించకూడదు. బాహ్య ప్రపంచంలో ఎంత అలజడి ఉన్నా, మన అంతరంగంలో ప్రశాంతతను కాపాడుకునే బాధ్యత పూర్తిగా మనదే. ఈ రోజే ఇప్పుడే కాసేపు ఫోన్ పక్కన పెట్టి, ఒక్కసారి ప్రశాంతంగా గాలి పీల్చుకుని మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడండి. అసలైన సంతోషం, అనుబంధాలు అక్కడే ఉన్నాయి. మనల్ని, మన కుటుంబాలను ఈ డిజిటల్ మాఫియా నుండి కాపాడుకోవడానికి తక్షణమే మేల్కొనకపోతే, భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవు. డిజిటల్ ప్రపంచం ఒక రంగుల ప్రపంచం. అది ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో, అంత ప్రమాదకరంగా మారుతోంది. సోషల్ మీడియా ఇచ్చే లైకులు, కామెంట్లు మన జీవిత విలువను నిర్ణయించలేవు. మన చుట్టూ ఉన్న నిజమైన మనుషులు, వారి ప్రేమ, ఆత్మీయత మాత్రమే మనల్ని జీవితాంతం కాపాడతాయి. కాబట్టి, టెక్నాలజీని ఒక సాధనంగా మాత్రమే వాడుకుందాం. దానికి బానిసలుగా మారి మన జీవితాలను నాశనం చేసుకోకుండా, రేపటి తరం కోసం ఒక ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఒక ప్రశాంతమైన జీవన విధానం వైపు అడుగులు వేద్దాం.

## మాయా లోకం నుండి నిజ లోకంలోకి అడుగుపెడదాం!

డిజిటల్ ప్రపంచం ఒక రంగుల మాయాజాలం. అది ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తుందో, అంతకంటే వేగంగా మన జీవితాలను ప్రమాదంలోకి నెట్టేస్తోంది. సోషల్ మీడియాలో వచ్చే తాత్కాలిక లైకులు, కామెంట్లు, నకిలీ ప్రశంసలు మన జీవిత విలువను ఎప్పటికీ నిర్ణయించలేవు. ఈ డిజిటల్ మాఫియా సృష్టిస్తున్న మానసిక, శారీరక రుగ్మతల నుండి, ఛిద్రమవుతున్న కుటుంబ బంధాల నుండి మనల్ని మనం రక్షించుకోవాల్సిన అత్యంత కీలకమైన సమయం ఆసన్నమైంది. సాంకేతికతను మన జీవితాలను సులభతరం చేసే ఒక సాధనంగా మాత్రమే వాడుకుందాం తప్ప, దానికి బానిసలై మన మనశ్శాంతిని పణంగా పెట్టవద్దు. మన చుట్టూ ఉన్న నిజమైన మనుషులు, వారి ఆత్మీయమైన పలకరింపులు, కుటుంబ సభ్యుల నిష్కల్మషమైన ప్రేమ మాత్రమే మనకు జీవితాంతం తోడుగా నిలుస్తాయి. నేటి నుండే డిజిటల్ మినిమలిజం వైపు అడుగులు వేస్తూ, స్వీయ నియంత్రణను అలవాటు చేసుకుందాం. రేపటి తరం భవిష్యత్తును అంధకారం కాకుండా కాపాడుకుంటూ ఒక ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజాన్ని నిర్మించుకుందాం. కాసేపు ఆ ఫోన్ పక్కన పెట్టి, మన చుట్టూ ఉన్న అద్భుతమైన సృష్టిని, బంధాలను ఆస్వాదిస్తూ ప్రశాంతమైన జీవన విధానాన్ని ప్రారంభిద్దాం.

– టీ.కే.రావు
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
9000316036

# మహిళా టీ 20లో చాంపియన్ ఆసీస్

## మరోసారి ప్రపంచ విజేత ఆస్ట్రేలియా..!

### ఏడో టైటిల్ సొంతం, ఇంగ్లండ్ ఆశలు గల్లంతు

మహిళల టీ20 ప్రపంచకప్‌లో మరోసారి ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఫైనల్లో ఇంగ్లండ్‌ను ఓడించి ఏడోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించారు. మరోసారి ప్రపంచ క్రికెట్‌లో తామే అగ్రశ్రేణి జట్టు అని నిరూపించారు.

**ఇంగ్లండ్ పోరాటం వృధా**

ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. కెప్టెన్ నాట్ స్కివర్-బ్రంట్ అజేయంగా 58 పరుగులు చేసి జట్టును ఆదుకుంది. ఫ్రేయా కెంప్ 44 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడింది. తొలి దశలో వరుస వికెట్లు కోల్పోయినా ఈ ఇద్దరి భాగస్వామ్యం జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు బెత్ మూనీ అద్భుత అర్ధశతకంతో బలమైన పునాది వేసింది. 38 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసి జట్టును విజయానికి చేరువ చేసింది. మరోవైపు ఫీబీ లిచ్‌ఫీల్డ్ 48 పరుగులు చేసి అర్ధశతకాన్ని తృటిలో చేజార్చుకున్నా కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఈ ఇద్దరి ప్రదర్శనతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలోనే 153 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది.

**ఏడో టైటిల్‌తో చరిత్ర**

ఈ విజయంతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా ఏడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నమెంట్ మొత్తం నిలకడైన ఆటతో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఫైనల్లోనూ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొని మరో ప్రపంచకప్‌ను తమ ఖాతాలో వేసుకుంది. మరోసారి మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియా అజేయ శక్తిగా నిలుస్తూ ప్రపంచ వేదికపై తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.






# గంభీర్ ఎవరు..!?

## కోహ్లీ, రోహిత్ భవితవ్యం తేల్చడానికి | కుండబద్దలు కొట్టిన మాజీ కపిల్ దేవ్

### ఆటకు వయసు ప్రమాణికం కాదు

భారత జట్టు సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 ప్రపంచకప్‌లో ఆడతారా లేదా అనే చర్చ కొనసాగుతున్న వేళ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నిర్ణయమే కీలకం కాదని ఆయన స్పష్టం చేశారు. జట్టులో ఎవరిని ఎంపిక చేయాలనే బాధ్యత పూర్తిగా సెలెక్టర్లదేనని చెప్పారు. సెలెక్టర్లు తమ పని సక్రమంగా చేస్తే కోచ్ అభిప్రాయం తప్పనిసరి కాదని అభిప్రాయపడ్డారు.

**ముందు సెలెక్టర్లు.. తర్వాత కెప్టెన్**

కపిల్ దేవ్ అభిప్రాయం ప్రకారం జట్టు ఎంపికలో మొదటి హక్కు ఐదుగురు సెలెక్టర్లకే ఉంటుంది. వారి నిర్ణయం తర్వాత కెప్టెన్ అభిప్రాయాన్ని తీసుకోవాలి. చివరగా అవసరమైతే కోచ్‌తో చర్చించవచ్చని వివరించారు. సెలెక్టర్లు సరైన ఆటగాళ్లను గుర్తించి ఎంపిక చేస్తే అదనపు జోక్యం అవసరం ఉండదని పేర్కొన్నారు.

**వయసు కాదు ప్రతిభ ముఖ్యం**

2027 ప్రపంచకప్ సమయానికి విరాట్ కోహ్లీ వయసు దాదాపు 39 సంవత్సరాలు, రోహిత్ శర్మ 40 సంవత్సరాలకు చేరుకుంటారు. అయినప్పటికీ వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోవద్దని కపిల్ దేవ్ సూచించారు. శారీరకంగా దృఢంగా ఉండి, అత్యుత్తమ ప్రదర్శన ఇస్తే ఎంత వయసులోనైనా జట్టులో స్థానం దక్కాలని చెప్పారు.

**ఫామ్ తగ్గితే ఒత్తిడి ఎక్కువ**

అయితే సీనియర్ ఆటగాళ్ల విషయంలో ఫామ్ తగ్గితే విమర్శలు ఎక్కువగా వస్తాయని కపిల్ దేవ్ అన్నారు. యువ ఆటగాడు విఫలమైతే తిరిగి నిలబడే అవకాశం ఉందని అందరూ భావిస్తారని, అదే పరిస్థితి సీనియర్ ఆటగాడికి వస్తే అతని సమయం ముగిసిందనే అభిప్రాయం వ్యక్తమవుతుందని చెప్పారు. ప్రస్తుతం కోహ్లీ, రోహిత్ భారత వన్డే జట్టులో కీలక సభ్యులేనని, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో కూడా వారు కీలక పాత్ర పోషించే అవకాశముందని పేర్కొన్నారు.

# పృథ్వీ షా నిశ్చితార్థం

## రహస్య పోస్టు వైరల్

### సోషల్ మీడియాలో హల్‌చల్



భారత క్రికెటర్ పృథ్వీ షా నిశ్చితార్థ భాగస్వామి అకృతి అగర్వాల్ చేసినట్లు ప్రచారం జరుగుతున్న ఓ సోషల్ మీడియా పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆ పోస్టులో తనను ఎన్నోసార్లు మోసం చేశారని, ఇప్పటి వరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదని పేర్కొన్నట్లు స్క్రీన్‌షాట్లు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. తర్వాత ఆ పోస్టును తొలగించినట్లు కూడా ప్రచారం సాగుతోంది. అయితే ఈ పోస్టులో ఆమె ఎక్కడా పృథ్వీ షా పేరు ప్రస్తావించలేదు.

**ఊహాగానాలకు తెరలేపిన వ్యాఖ్యలు**

మరో పోస్టులో "ప్రతి పుకారు నిజమే. సోషల్ మీడియాలో అతని గురించి కనిపిస్తున్న ప్రతిదీ నిజమే" అనే వ్యాఖ్య చేసినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఆ వ్యాఖ్యలు పృథ్వీ షాను ఉద్దేశించివేనని కొందరు సోషల్ మీడియా వినియోగదారులు ఊహిస్తున్నారు. అయితే దీనిపై అకృతి అగర్వాల్ నుంచి గానీ, పృథ్వీ షా నుంచి గానీ ఎలాంటి అధికారిక వివరణ రాలేదు. అందువల్ల ఈ ప్రచారాన్ని ధ్రువీకరించే ఆధారాలు ప్రస్తుతం లేవు.

**నిశ్చితార్థ పోస్టులు యథాతథం**

పృథ్వీ షా, అకృతి అగర్వాల్ ఈ ఏడాది మార్చిలో నిశ్చితార్థం చేసుకున్నారు. చాలా కాలం ప్రేమలో ఉన్న తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజా ప్రచారం మధ్య కూడా అకృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పృథ్వీ షాను అన్‌ఫాలో చేయలేదు. నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలను కూడా తొలగించలేదు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలపై వస్తున్న వార్తలకు అధికారిక నిర్ధారణ లభించలేదు.

**కెరీర్‌పై దృష్టి పెట్టిన పృథ్వీ**

మరోవైపు పృథ్వీ షా తన క్రికెట్ కెరీర్‌పై పూర్తిగా దృష్టి సారించినట్లు ఇటీవల వెల్లడించారు. భారత జట్టులోకి తిరిగి రావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.



# చీకటిని సవాలు చేస్తా

## 'సట్లుజ్' వివాదంపై స్పందించిన దిల్జిత్

### నిలిపివేత తర్వాత స్పందించిన స్టార్

భారత్‌లో జీ5 వేదిక నుంచి 'సట్లుజ్' చిత్రాన్ని తొలగించిన కొద్ది గంటల్లోనే హీరో దిల్జిత్ దోసాంఝ్ తన తొలి స్పందనను వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సినిమా క్లిప్‌ను పంచుకుంటూ "నేను చీకటిని సవాలు చేస్తున్నాను" అనే సందేశాన్ని పోస్టు చేశారు. ఈ పోస్ట్‌తో పాటు అమరవీరుడు జస్వంత్ సింగ్ ఖల్రాను ప్రస్తావిస్తూ, 'సట్లుజ్‌కు జరిగినదే ఖల్రాకు కూడా జరిగింది' అని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన పోస్టు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది.

**జస్వంత్ సింగ్ ఖల్రా ప్రస్తావన**

దిల్జిత్ తన పోస్టులో జస్వంత్ సింగ్ ఖల్రా జీవితాన్ని గుర్తు చేశారు. పంజాబ్‌లో మానవ హక్కుల కోసం పోరాడిన ప్రముఖ కార్యకర్తగా ఖల్రా గుర్తింపు పొందారు. అక్రమ హత్యలు, రహస్య దహనాల అంశాలను వెలుగులోకి తీసుకువచ్చిన వ్యక్తిగా ఆయన పేరు నిలిచింది. ఖల్రా జీవిత కథ ఆధారంగానే ఈ సినిమా రూపొందినట్లు తెలిసిందే. అందుకే ఆయన పేరును ప్రస్తావిస్తూ దిల్జిత్ తన సందేశాన్ని అభిమానులతో పంచుకున్నారు.

**జీ5 నిర్ణయంపై చర్చ**

జూలై 3న ఓటీటీలో విడుదలైన 'సట్లుజ్' చిత్రం రెండు రోజుల్లోనే భారత్‌లో అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సినిమాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జీ5 ప్రకటించింది. న్యాయపరమైన ప్రక్రియ పూర్తైన తర్వాత తిరిగి విడుదల చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ చిత్రం వెనుక ఉన్న సృజనాత్మక ఆలోచనకు తమ మద్దతు కొనసాగుతుందని వెల్లడించింది.

# విడుదలైన రెండు రోజుల్లోనే సట్లుజ్‌కు బ్రేక్

### జీ5 నుంచి తొలగింపు... మళ్లీ వివాదంలో సినిమా

ప్రముఖ నటుడు దిల్జిత్ దోసాంఝ్ ప్రధాన పాత్రలో నటించిన 'సట్లుజ్' సినిమా విడుదలైన రెండు రోజుల్లోనే జీ5 వేదిక నుంచి భారత్‌లో తొలగించారు. జూలై 3న ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన పొందినప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో భారత్‌లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అందుబాటులో ఉండదని జీ5 ప్రకటించింది. ఈ నిర్ణయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**జీ5 అధికారిక ప్రకటన**

సినిమాకు ప్రేక్షకులు చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన జీ5, ఈ చిత్రం వెనుక ఉన్న సృజనాత్మక ఆలోచనకు తమ మద్దతు కొనసాగుతుందని వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా భారత్‌లో తాత్కాలికంగా ప్రదర్శన నిలిపివేస్తున్నామని తెలిపింది. అవసరమైన న్యాయపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత వీలైనంత త్వరగా సినిమాను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని పేర్కొంది.

**మూడేళ్లుగా కొనసాగిన వివాదం**

ఈ సినిమా మొదట 'పంజాబ్ 95' పేరుతో రూపొందింది. 2022లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు పంపినా, దాదాపు మూడేళ్ల పాటు సర్టిఫికేషన్ ప్రక్రియలోనే నిలిచిపోయింది. చిత్రానికి 127 కత్తిరింపులు సూచించినట్లు దర్శకుడు గతంలో ఆరోపించారు. 2023లో టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించాలనుకున్నా, చివరి నిమిషంలో ఆ ప్రదర్శన కూడా రద్దైంది.

**పేరు మార్చినా సమస్యలు కొనసాగాయి**

తర్వాత 'పంజాబ్ 95' పేరును మార్చి 'సట్లుజ్'గా విడుదల చేశారు. అయినప్పటికీ వివాదాలకు పూర్తిగా తెరపడలేదు. విడుదలైన రెండు రోజుల్లోనే ఓటీటీ వేదిక నుంచి తొలగించడంతో మరోసారి ఈ చిత్రం వార్తల్లో నిలిచింది. దిల్జిత్ దోసాంఝ్‌తో పాటు కన్వల్‌జిత్ సింగ్, అర్జున్ రాంపాల్, సువీందర్ విక్కీ, గీతికా విద్యా ఓహ్లియన్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం మళ్లీ ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.




# సట్లుజ్ నిలిపివేత

### ప్రయాణం ఇంకా ముగియలేదు
### దిల్జిత్ అభిమానుల భావోద్వేగం
### సినిమాకు మద్దతుగా అభిమానులు

దిల్జిత్ దోసాంఝ్ ప్రధాన పాత్రలో నటించిన 'సట్లుజ్' చిత్రం భారత్‌లో జీ5 వేదిక నుంచి తొలగించబడిన తర్వాత అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. సినిమా ప్రదర్శన నిలిచిపోయినా దాని ప్రయాణం ఇంకా ముగియలేదని పోస్టులు చేస్తున్నారు. ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. జూలై 3న ఓటీటీలో విడుదలైన ఈ సినిమా రెండు రోజుల్లోనే భారత్‌లో నిలిపివేయడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**విదేశాల్లో అభిమానులకు పిలుపు**

సినిమా నిలిపివేత తర్వాత దిల్జిత్ బృందం సోషల్ మీడియా ద్వారా స్పందించింది. విదేశాల్లో నివసిస్తున్న అభిమానులు జీ5లో ఈ చిత్రాన్ని చూసి, అందులోని సందేశాన్ని మరింత మందికి చేరవేయాలని కోరింది. సినిమా ఆగిపోయినా దాని ఆలోచన, సందేశం ఆగదనే భావనను అభిమానులతో పంచుకుంది. ఈ పోస్టుకు విదేశాల్లోని అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

**జీ5 స్పష్టీకరణ**

సినిమాను తాత్కాలికంగా భారత్‌లో నిలిపివేసిన విషయాన్ని జీ5 అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకులు అందించిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన సంస్థ, ఈ చిత్రం వెనుక ఉన్న సృజనాత్మక దృక్పథానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో భారత్‌లో అందుబాటులో ఉండదని తెలిపింది. న్యాయపరమైన ప్రక్రియ పూర్తైన తర్వాత వీలైనంత త్వరగా తిరిగి విడుదల చేసేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తామని స్పష్టం చేసింది.

# సల్మాన్ ఖాన్ పర్ఫెక్షనిస్ట్

### సంతృప్తి చెందే వరకు పెళ్లిళ్లు
### నాడు అమీర్ ఖాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు
### తాజాగా వైరల్ అవుతున్న నాటి సల్మాన్ కామెంట్స్


బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్-గౌరీ స్ప్రాట్‌ను వివాహం చేసుకున్న నేపథ్యంలో సల్మాన్ ఖాన్ గతంలో చేసిన సరదా వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబైలోని బాంద్రా నివాసంలో అత్యంత సన్నిహితుల సమక్షంలో ఆమిర్ రిజిస్ట్రేషన్ వివాహం చేసుకున్న తర్వాత అభిమానులు పాత ఇంటర్వ్యూలను గుర్తు చేసుకుంటున్నారు. 'పర్‌ఫెక్ట్ అయ్యే వరకు పెళ్లి చేసుకుంటాడు' ఒక టెలివిజన్ కార్యక్రమంలో వ్యాఖ్యాత కపిల్ శర్మ అమీర్ వ్యక్తిగత జీవితంపై సల్మాన్‌ను ప్రశ్నించారు. దానికి స్పందించిన సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ నిజమైన పర్‌ఫెక్షనిస్ట్ అని సరదాగా అన్నారు. పెళ్లి అనే విషయాన్ని పూర్తిగా పర్‌ఫెక్ట్ చేసే వరకు ఆయన పెళ్లి చేసుకుంటూనే ఉంటారని చమత్కరించారు. ఆ వ్యాఖ్యలు అప్పట్లో ప్రేక్షకులను నవ్వించగా, ఇప్పుడు అమీర్ ఖాన్ తాజా వివాహంతో మరోసారి వైరల్‌గా మారాయి. అమీర్ ఖాన్ వివాహం తర్వాత సల్మాన్ చేసిన పాత వ్యాఖ్యలు మరోసారి నెటిజన్లలో చర్చకు దారితీశాయి. కొందరు సల్మాన్ చెప్పిన మాటలను సరదాగా పంచుకుంటుండగా, మరికొందరు అది ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన హాస్య సంభాషణ మాత్రమేనని గుర్తు చేస్తున్నారు. మొత్తానికి అమీర్ ఖాన్ కొత్త జీవితాన్ని ప్రారంభించిన వేళ సల్మాన్ పాత చమత్కారం మళ్లీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



# గౌరీతో ఏడడుగుల బంధం

### సన్నిహితుల మధ్య సాదాసీదా వేడుక

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ తన జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. గౌరీ స్ప్రాట్‌ను ముంబైలోని బాంద్రా నివాసంలో అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. చట్టపరంగా వివాహ నమోదు ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే ఈ వేడుకకు హాజరయ్యారు. వివాహం అనంతరం నూతన దంపతుల తొలి ఫొటోను ఆమిర్ బృందం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయడంతో అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అమీర్ ఖాన్, గౌరీ స్ప్రాట్‌కు దాదాపు 25 ఏళ్లుగా పరిచయం ఉంది. అయితే రెండేళ్ల క్రితమే ఇద్దరి మధ్య ప్రేమ బంధం ప్రారంభమైంది. తన 60వ పుట్టినరోజు సందర్భంగా గౌరీతో ఉన్న సంబంధాన్ని అమీర్ ఖాన్ అధికారికంగా ప్రకటించారు. గౌరీ తన జీవితంలో ప్రశాంతతను తీసుకొచ్చిందని, ఆమెతో కలిసి కొత్త ప్రయాణం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని పలుమార్లు వెల్లడించారు. తన జీవితంలో రీనా దత్తా, కిరణ్ రావు, ఇప్పుడు గౌరీ ముగ్గురూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కూడా చెప్పారు. ఈ వివాహ వేడుకకు అమీర్ ఖాన్ పిల్లలు జునైద్, ఐరా, ఆజాద్ హాజరయ్యారు. గౌరీ కుమారుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. విదేశాల నుంచి వచ్చిన బంధువులతో కలిపి సుమారు 150 మంది అతిథులు మాత్రమే వివాహానికి ఆహ్వానించబడ్డారు. ఆర్భాటాలకు దూరంగా ఇంట్లోనే వివాహం జరపాలని ముందుగానే అమీర్ ఖాన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రెండు కుటుంబాల ఆశీర్వాదాల మధ్య ఈ వేడుక సంతోషకర వాతావరణంలో జరిగింది.



# కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్ విడుదల

### సంక్రాంతి రేసుకు భారీ ఎంటర్టైనర్

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న భారీ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌కు సంబంధించిన కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్ ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదలైంది. తెల్లటి పంచె, కుర్తాలో పండుగ వాతావరణంలో డ్యాన్స్ స్టెప్ వేస్తూ కనిపించిన ఆయన లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టి సంక్రాంతి 2027కు భారీ వినోదాన్ని అందిస్తామని ప్రకటించారు. సినిమాలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ జోడీగా కృతి శెట్టి నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది.



This newspaper is Owned and Published by **KANTIPUDI RAVENDRA** from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: **KANTIPUDI RAVENDRA**, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com. Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085